తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్టేట్ రౌండప్
STATE ROUNDUP
ప్రజాజ్యోతి తెలంగాణ గురువారం 15-02-2024 పేజీల్-12

## వీసీలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు

### తెలంగాణ యూనివర్సిటీల వీసీలకు దరఖాస్తుల వెల్లువ

### పది విశ్వవిద్యాలయాలకు 1,382 దరఖాస్తులు

హైదరాబాద్,ఫిబ్రవరి 14: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల పదవీకాలం ముగియనుండటంతో కొత్త వీసీ నియామకం ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది. తెలంగాణలోని యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసింది. పది యూనివర్సిటీలకు సంబంధించి వీసీ పోస్టుల కోసం

మిగతా 2లో..

# రైతు రుణమాఫీ ఎప్పటిలోపు పూర్తిచేస్తారు?

### కాళేశ్వరం విషయంలో గోరంతను కొండంత చేయొద్దు

### ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### కోరంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు



హైదరాబాద్,ఫిబ్రవరి14:
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఏడాదికి రూ. 1.36 లక్షల కోట్లు అవసరమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. భారాస పదేళ్ల పాలనలో ఆర్థిక అభివృద్ధి జరిగిందంటూ గణాంకాలను చదివి వినిపించారు. 'కేసీఆర్ పాలనతో తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, యువత, రైతు, మహిళా డిక్లరేషన్లు ప్రకటించారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు లెక్కిస్తే 420 ఉన్నాయి. ఆరు గ్యారంటీల అమలకు ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ సరిపోదు. రుణమాఫీ సహా ప్రకటించిన డిక్లరేషన్లకు అయ్యే వ్యయం దీనికి అదనం. డిసెంబర్ 9న రైతు రుణాలను మాఫీ చేస్తామన్నారు.. అదే మేం అడుగుతున్నాం. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. 119 నియోజకవర్గాల్లో 4.16లక్షల ఇళ్లకు రూ.24వేల కోట్లు అవసరం. బడ్జెట్‌లో కేవలం రూ.7వేల కోట్లే కేటాయించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామన్నారు. ఇంటిలో ఒక్కరికే ఇచ్చినా రూ.20వేల కోట్లు కావాలి. ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. రైతు రుణమాఫీ ఏవిధంగా..

మిగతా 4లో..



## మాతృభాషను రక్షించుకోవాలి

### తల్లిదండ్రులు పిల్లలకు మాతృభాషను నేర్పించాలి
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్,ఫిబ్రవరి14:
ప్రతి ఒక్కరు తమ మాతృభాషను రక్షించుకోవాలని ఇంగ్లీష్ పై మోజు ఉండాలి కానీ తమ మాతృభాషను చంపుకోకూడదని అందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు మాతృభాషను విధిగా నేర్పించి మాతృభాషను రక్షించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వసంత పంచమి( శ్రీ పంచమి) పర్వదినాన్ని పురస్కరించుకొని అంబర్పేట లోని మహంకాళి ఆలయంలో కేంద్ర

మిగతా 4లో..

## టీఎస్ఆర్టీసీ సరికొత్త చరిత్ర

### ఒక్కరోజే బస్సుల్లో 65లక్షల మంది ప్రయాణం

హైదరాబాద్,ఫిబ్రవరి14:
టీఎస్ఆర్టీసీ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక్క సోమవారం రోజే బస్సుల్లో 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ హిస్టరీలోనే అత్యధికంగా 106.02 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. రెండు నెలల క్రితం రేవంత్ సర్కార్ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభించింది. ఈ పథకం ఇప్పటికే గ్రాండ్ సక్సెస్ అయింది. ఎక్కువగా హైదరాబాద్‌తో పాటు వేములవాడ, కాళేశ్వరం సహా వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే రూట్లలో ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. మొత్తంగా ఈ అద్భుత అవకాశాన్ని మహిళలు చక్కగా వినియోగించుకుంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఒకటి.

మిగతా 2లో..



# మరో పదేళ్లు నేనే సీఎం

మేయిన్ పేజీ తరువాయి..

అసెంబ్లీకి రాని వారికి అధికారం ఎందుకంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రావడానికి కేసీఆర్ కి ధైర్యం లేదని.. కానీ నల్గొండ పోయి మాట్లాడుతున్నారంటూ కౌంటర్ ఇచ్చారు.. పాలిచ్చే బర్రెని కాదని దున్నపోతును తెచ్చుకున్నారని కేసిఆర్ అంటున్నారు.. నిన్న అసెంబ్లీలో అటెండర్ రేసు గుర్రం వచ్చిందని చెప్పాడంటూ కౌంటర్ ఇచ్చారు. చచ్చిన పామును చంపే అలవాటు తమకు లేదన్నారు. 10 ఏళ్ల క్రిందట కేసిఆర్ పెట్టిన సంతకాలు ఇప్పుడు గుదిబండగా మారాయని.. అడ్డా మీద కొట్లడటం కాదు చట్ట సభలోకి రావాలంటూ రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్స్ కు రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో గంజాయిని మాట వినిపించకుడదని.. గంజాయిపై ఉక్కుపాదం మోపాలంటూ పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న ఇదే వేదికలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధి సమక్షంలో ప్రమాణం చేసినపుడు ఎంత ఆనందం కలిగిందో.. నియామక పత్రాలు అందిస్తుంటే.. అంతకంటే ఎక్కువ ఆనందంగా ఉందంటూ వ్యాఖ్యానించారు. తమకు కుటుంబం అంటే తెలంగాణ ప్రజలని.. పరీక్షలు రాసి ఎదురుచూసి నిరాశకు గురైన వారికి అండగా ఉండాలని కాంగ్రెస్ భావించిందన్నారు. 2014 లో రాష్ట్రం వచ్చాక నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు వస్తాయని భావించారని.. అలా రాలేదనన్నారు. గత ప్రభుత్వం వారి కుటుంబం గురించే ఆలోచించిందని.. న్యాయస్థానాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించే అవగాహన గత ప్రభుత్వ పెద్దలకు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అందరి సమస్యలపై దృష్టి పెట్టామని.. అందరికీ తాను అండగా ఉంటానని.. ఎలాంటి సమస్యా రానియ్యనంటూ పేర్కొన్నారు. స్టాఫ్ నర్స్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చాం.. నేడు కానిస్టేబుల్ నియామకాల పత్రాలు ఇస్తున్నాం.. నిరుద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## వీసీలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు

మొదటిపేజీ తరువాయి..

హైయర్ ఎడ్యూకేషన్ కౌన్సిల్ దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉస్మానియా యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్టీయూ, కాకతీయ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించింది ఉన్నత విద్యా మండలి. అలాగే, శాతవాహన యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీల వీసీల పోస్టులకు దరఖాస్తులు స్వీకరించింది. ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వీసీ పోస్ట్ కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి సూచించింది. అప్లికేషన్ తో పాటు అవసరమైన అన్ని పత్రాలను జత చేసి రిజిస్టర్ పోస్టు చేయాలని పేర్కొంది. జనవర 28 నుంచి ఫిబ్రవరి 12 వరకు అప్లికేషన్లు తీసుకోగా పది విశ్వవిద్యాలయాలకు గానూ 1,382 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో కొంతమంది ఒక్క యునివర్సిటీ వీసీ కాకుండా , ఏదో ఒక యూనివర్సిటీకి రాకపోతుందా అని, రెండు అంతకుమించి వర్సిటీ వీసీ పోస్టుల కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటికి 208 అప్లికేషన్లు రాగా, కనిష్టంగా జేఎన్ఏఎఫ్ఏయూకు 51 దరఖాస్తులు వచ్చాయి. వీసీ దరఖాస్తుల స్వీకరణ ముగియడంతో వాటి స్క్రూటిని ప్రక్రియను ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. వీటిని వడపోసి ప్రభుత్వానికి నివేదించనుంది. దీనికి అనుగుణంగా వైస్ చాన్సలర్ సెర్చ్ కమిటీ ఏర్పాటు ప్రక్రియను కూడా ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల్లో ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలు జరిపి, నామినీల నియామకం పూర్తి చేస్తారు. %ఖ+జ% నామీనిల కోసం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం లేఖ రాశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి నామినిల జాబితా రాగానే ముగ్గురు సభ్యులతో యునివర్సిటీకి ఒక సెర్చ్ కమిటీ నియమిస్తారు. ఆ తర్వాత వీసీ పోస్టుల కోసం వచ్చి దరఖాస్తుల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ స్టార్ట్ అవుతుంది. వైస్ చాన్సలర్లను నియామకాన్ని వేగవంతంగా పూర్తి చేసి విశ్వవిద్యాలయాల్లోని సమస్యలకు చెక్ పెట్టాలని సర్కార్ భావిస్తోంది.

## చేతకాకుంటే రాజీనామా చేయ్ రేవంత్..

మేయిన్ పేజీ తరువాయి..

భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో 94 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండితే.. మా హయాంలో మూడు కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండినయ్.. మ్యాజిక్ చేస్తేనో, మంత్రమేస్తనో పండుతాయా..? మూడు కోట్ల మెట్రిక్ టన్నుల పంట ఎందుకు పండింది. మా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది కనుక దాని మీద బురద జల్లాలి. ఏదో ఒక రకంగా మాకు చెడ్డ పేరు తెచ్చి, ప్రజల్లో అనుమానాలు కలిగించే విధంగా దుష్ప్రచారానికి వాళ్లు పాల్పడుతున్నారు. కానీ నిజం నిలకడ మీద తెలుస్తది. మేం రిజర్వాయర్లు నింపి పెట్టినం కనుక యాసంగికి నీళ్లు పోతున్నాయి ఇబ్బంది లేదు. వచ్చే యాసంగికి నీళ్లు రాలేదు అనుకో. కేసీఆర్ ఉన్నంగ నీళ్లు వచ్చినయ్.. ఇప్పుడు ఎందుకు వస్తలేవు అని ప్రజలు ఆలోచించరా..? అని హరీశ్‌రావు అడిగారు. ఇప్పటికీ నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంది. అదే విషయాన్ని ఇంజినీర్లు కూడా చెబుతున్నారు. వాళ్లకు చేతకాకపోతే మాకు ప్రభుత్వాన్ని అప్పజెప్పమనండి. మేం చేసి చూపిస్తాం. రేవంత్ రెడ్డిని రాజీనామా చేయమను. నేను ఎక్కి చేపిస్తా. రేవంత్‌ను దిగమను. నేను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి చూపిస్తా. నాకు మద్దతు ఇస్తా అంటే ఐయామ్ రెడీ టు టేక్ ఇట్. ఆయనకు చేతకాదు.. హరీశ్‌రావు నీవు చేయ్ అంటే చేసి చూపిస్తా. రైతులకు నష్టం కలగకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టమని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎవరు ఎన్నేండ్లు ముఖ్యమంత్రి ఉండాలనేది ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి అని చెబుతున్నాం. మీరు బాగా చేస్తే ఆదరిస్తారు.. లేదంటే బండకేసి కొడుతారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడి హెూదాలో ఉండి కేసీఆర్‌ను కాల్చేయాలి, ఉరితీయాలని మాట్లాడిండు. ఆయన అలా మాట్లాడొచ్చా..? అని హరీశ్‌రావు అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాస్ట్ పెరిగిందని, దానికేదో మేం కారణమన్నట్లు కాంగ్రెస్ బురదజల్లడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఈ విషయంపై వివరణ ఇద్దామంటే మాకు అసెంబ్లీలో మైక్ ఇవ్వడం లేదు.. గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. సభలో అవకాశం ఇవ్వకపోతే మీడియా పాయింట్‌కు వెళ్దామంటే అడ్డుకున్నారు. మీడియా సమావేశం ద్వారా రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది అని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు అంచనాలు పెరిగాయని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. 2007లో ప్రాణహిత – చేవెళ్లకు జీవో ఇచ్చారు. 17 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు పనులు చేస్తామని జీవోలో పేర్కొన్నారు. 2008లో దాన్ని రూ. 38 వేల 500 కోట్లకు తెచ్చారు. ఏ పనులు చేయకుండానే అంచనాలు ఎందుకు పెరిగాయి. మళ్ల ఒక్క సంవత్సరం లోగా సీడబ్ల్యూసీకి రూ. 40 వేల కోట్లతో డీపీఆర్ పంపించింది ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇది నిజం కాదా..? ఈ రోజుకు ఆ రోజుకు ఎంత మార్పు వచ్చింది. నాడు 14 టీఎంసీల రిజర్వాయర్లు ఉంటే.. ఇవాళ 141 టీఎంసీల రిజర్వాయర్ల సామర్థ్యంతో కాళేశ్వరం కట్టాం. మరి ఈ రిజర్వాయర్లు కట్టాలంటే రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. భూసేకరణ చేయాలి. మూడు బ్యారేజీలు, పంపు హౌస్‌లు కట్టాల్సి ఉంటుంది. మరి ప్రాజెక్టు కాస్ట్ పెరగదా..? అని హరీశ్‌రావు నిలదీశారు. కల్వకుర్తి ఎత్తిపోతల విషయంలో చంద్రబాబు, రాజేశేఖర్ రెడ్డి కాలయాపన చేశారు. బాబు శిలాఫలకాలు వేస్తే రాజశేఖర్ రెడ్డి మొక్కలు పెంచారు.. రాజశేఖర్ రెడ్డి శిలాఫలకాలు వేస్తే బాబు మొక్కలు పెంచారు. కానీ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. 2014లోనే 90 శాతం పూర్తి చేశామని చెప్పారు. మరి 13 వేల ఎకరాలకు ఆయకట్టు ఇచ్చారు. కల్వకుర్తి కింద 3 లక్షల 30 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉండే. మరి ఎందుకు ఇవ్వలేదు. మేం వచ్చిన తర్వాత దృష్టి పెట్టి 3 లక్షల 7 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. కెనాల్స్ బాగు చేసి నీళ్లు అందించాం. కాళేశ్వరంలో కూడా 90 శాతం మేజర్ పనులు అయిపోయాయి. కేవలం మైనర్స్, సబ్ మైనర్స్ తవ్వాలి. మేం కల్వకుర్తిలో చేయలేదా..? మీరు కాళేశ్వరంలో చేయలేరా..? అని ప్రశ్నించారు. నెట్టెంపాడు కింద మీరు 90 శాతం పూర్తయిందని చెప్పి 2,300 ఎకరాలకు సాగునీళ్లు ఇస్తే.. మేం పెండింగ్ పనులు పూర్తి చేసి లక్షా 40 వేల ఎకరాలకు నీళ్లందించాం. బీమా కింద 12 వేల ఎకరాలకు మీరు నీళ్లు ఇస్తే.. మేం కాల్వలు పూర్తి చేసి లక్షా 50 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. కాళేశ్వరం విషయంలో మీరు చేయాల్సింది కాల్వలు తవ్వి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వండి. మేడిగడ్డపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తానే ఓపెన్‌గా డిమాండ్ చేశాను. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని పునరుద్ధరణ చర్యలు చేపట్టండి. ఆలస్యం చేస్తే ప్రజలకు సాగు, తాగునీటికి కష్టాలు వస్తాయని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆయకట్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ దుష్ప్రచారం చేస్తోంది మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కొత్త ఆయకట్టు 98,570 ఎకరాల గురించే మాట్లాడుతుందని తెలిపారు. కాళేశ్వరం కింద మొత్తం 20 లక్షల ఎకరాలకు నీళ్లు పారాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఆయకట్టు గురించి ఇంజినీర్లు చెప్పబోతుంటే వారిని దబాయించే ప్రయత్నం చేశారు సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు. మంత్రులు ఇచ్చిన రిపోర్టు ప్రకారం.. 98570 ఎకరాలు కొత్త ఆయకట్టు అని పేర్కొన్నారు. 15 రోజుల క్రితం కొండా సురేఖ రంగనాయక సాగర్ నీటిని విడుదల చేస్తూ లక్షా 10 వేల ఎకరాలకు నీళ్లు విడుదల చేస్తున్నానని చెప్పారు. మరి మంత్రుల రిపోర్టుకు, కొండా సురేఖ మాటలకు తేడా ఉంది కదా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 456 చెరువులను కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్స్ ద్వారా కలపడం జరిగింది. దీనికింద 39,146 ఎకరాలకు నీళ్లు వచ్చాయన్నారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం నీళ్లను కలిపిన తర్వాత.. అక్కడ కూడా 2143 చెరువులను నింపడం జరిగింది. దాంతో ఒక లక్షా 67 వేల 50 ఎకరాలకు నీళ్లు వచ్చాయి. ఇది కాకుండా ఎస్సారెస్పీ స్టేజీ 1లో తొమ్మిదిన్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే ఐదారు లక్షలకు మించి నీళ్లు పారలేదు. కానీ కాళేశ్వరంతో కనెక్ట్ చేసిన తర్వాత తొమ్మిదిన్నర లక్షల ఎకరాలకు నీళ్లు పారాయి. ఎస్సారెస్పీ స్టేజీ–2ని గత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదు. సర్కారు తుమ్మలు మొలిస్తే.. మేం పునరుద్ధరించాం. కాళేశ్వరం ప్రాజెక్టును అనుసంధానం చేసి రెండు పంటలకు నాలుగన్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. కాంగ్రెస్ హయాంలో ఒక్క చుక్క నీరు రాలేదు. కాళేశ్వరం నీళ్లతో పంటలు కాపాడుకున్న పరిస్థితి. వాస్తవానికి కొత్త ఆయకట్టు కానీ, చెరువుల కింద వచ్చిన ఆయకట్టు కానీ, స్థిరీకరణ చేసింది కలిపితే మొత్తం




20 లక్షల ఎకరాలకు ప్రయోజనం అందింది కాళేశ్వరం ద్వారా. ఈ వాస్తవాన్ని మరుగున పెట్టి కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓ రెండు, మూడు ఎంపీ సీట్ల కోసం వరద, బురద రాజకీయాలకు పాల్పడుతోంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని.. రేపటి తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు జీవధార అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇవాళ భూముల్లో పెరిగిన ఊటలు, ఉబికివస్తున్న బోరు బావులు కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు. కూడవెల్లి, హల్దీవాగు, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ కింద పచ్చని పంటలు కనబడుతున్నాయంటే అది కాళేశ్వరం ఫలితమే అని చెప్పారు. బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోయినంత మాత్రాన దాని భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టను డ్యామేజ్ చేయాలని దుష్ట పన్నాగానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోంది. తీవ్రంగా ఖండిస్తున్నాం ఆ సంఘటనను అని తాము అసెంబ్లీలో ఇప్పటికే చెప్పాం. ఏ విచారణకైనా సిద్ధమని మేం అసెంబ్లీలో చెప్పాం. దోషులను కఠినంగా శిక్షించాలని చెప్పాం. కానీ పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలని కోరాం. కానీ ప్రభుత్వం పునరుద్ధరణ మీద దృష్టి పెట్టకుండా దుష్ట రాజకీయాలకు పాల్పడుతోంది. గత చరిత్రలో ఇలాంటి ఘటనలు జరగలేదన్నట్టు చేస్తున్నారు. మన ఉమ్మడి రాష్ట్రంలో 1958లో కడెం ప్రాజెక్టు కట్టగానే గేట్లతో సహా కొట్టుకుపోయింది. తిరిగి పునరుద్ధరించారు. తిరిగి 1995లో కట్ట మొత్తం కొట్టుకుపోయింది. 1981, 1999లో సింగూరు డ్యాం పాక్షికంగా కొట్టుకుపోయింది. 2010లో ఎల్లంపల్లి బ్యారేజీ స్పిల్ వే కొట్టుకుపోయింది. 2004లో సాత్నాల ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ కొట్టుకుపోయింది. పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఇవాళ్టికి కొట్టుకుపోయాయి. కాంగ్రెస్ హయాంలో పంజాగుట్టలో ఫ్లై ఓవర్ కడుతుంటే కూలిపోయింది. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. పోలవరంలో డయాఫ్రేమ్, గైడ్ వాల్స్ కొట్టుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఏదన్న మేజర్ ప్రాజెక్టు నిర్మించినప్పుడు ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తీసుకుంటారు. రైతాంగానికి నష్టం జరగకుండా పునరుద్ధరణ చర్యలు తీసుకుంటారు. కానీ ఈ ప్రభుత్వం కాళేశ్వరం మీద దుష్ప్రచారం చేస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు.

## టీఎస్ఆర్టీసీ సరికొత్త చరిత్ర

మొదటిపేజీ తరువాయి..

ఈ హామీ అమలుపై సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ ఎండీతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సోనియా గాంధీ పుట్టిన రోజు అయిన డిసెంబర్ 9 నుంచి అమలులోకి తీసుకొచ్చారు. మహాలక్ష్మి పథకం అమలుతో.. 60 శాతం మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం టీఎస్ఆర్టీసీ వద్ద అద్దె వాటితో కలిపి మొత్తం 9,100 బస్సులున్నాయి. ఉచిత ప్రయాణం వల్ల రోజువారీ అదనపు ప్రయాణికుల సంఖ్య 12 లక్షల నుంచి 15 లక్షలకు చేరింది. మహాలక్ష్మి పథకం మొదలైన తర్వాత ఆర్టీసీకి అదనంగా 150 బస్సులు సమకూరాయి. ఇంకా 4 వేల అదనపు బస్సులు కావాల్సి ఉంది. దీంతో కొత్త బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. 2,000 మంది డ్రైవర్లను ఉన్నపళంగా రిక్రూట్ చేసుకోవాలని ప్రతిపాదించారు. దాంతో ప్రభుత్వం దశల వారీగా కొత్త బస్సుల్ని ప్రవేశపెడుతోంది. వీలైనంత త్వరగా ఎక్కువ బస్సుల్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.



# వనదేవతల జాతరకు అంకురార్పణ

మేయిన్ పేజీ తరువాయి..

పూజారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క గుడి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమలు తీసుకొని డోలు వాయిద్యాల నడుమ పూజారులు సమ్మక్క గుడికి చేరుకుని.. పూజా సామగ్రిని శుభ్రం చేశారు. ఆ తర్వాత పసుపు, కుంకుమలతో అమ్మవార్లను అలంకరించారు. అలాగే, గ్రామ శివారులోని పోచమ్మ, మైసమ్మ ఆలయాల దగ్గర పూజాలు నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయిని పవిత్ర జలంతో శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. గ్రామంలో దుష్ట శక్తులు రాకుండా కోడి పిల్లను, మామిడి తోరణాలు కట్టి రోడ్డుకు ఇరువైపులా బురక కర్రలు పాతి పూజలు చేశారు. మరోవైపు కన్నెపల్లిలోని సారలమ్మ గుడి దగ్గర కూడా మండమెలిగే పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయంతో పాటు అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేసి మామిడి తోరణాలతో అలంకరించారు. ఇక రాత్రి సమయంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య, పూజారులు కలిసి పసుపు, కుంకుమలు తీసుకొని బూర కొమ్ముల శబ్దాలు, డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క గద్దె పైకి చేరుకుంటారు. గద్దెలపై పసుపు, కుంకుమల పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించి గద్దెల ప్రాంగణంలోనే ఇవాళ రాత్రంతా జాగారం చేస్తారు. గురువారం ఉదయాన్నే సమ్మక్క పూజారులు పూజా సామగ్రితో మళ్లీ గుడికి వెళ్లి పూజలు చేస్తారు. జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు ఈ మండమెలిగే పూజ చేస్తారు. ఈ పూజ జరిగిందంటే.. అధికారికంగా జాతర ప్రారంభమైనట్టే.. అంటే జాతర మొదలైందన్నమాట.. దీంతో భక్తజనం మేడారానికి పోటెత్తుతోంది. ఇక ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మహా జాతర జరగనుంది. ఫిబ్రవరి 21న బుధవారం.. కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తీసుకొస్తారు. అదే రోజు పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి గ్రామం నుంచి గోవిందరాజును మేడారం గద్దలపైకి చేర్చుతారు.. 22న గురువారం.. చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని తీసుకొచ్చి. గద్దెపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రధాన ఘట్టానికి చేరుతుంది. 23న శుక్రవారం.. వన దేవతలు గద్దెలపై కొలువుదీరుతారు. 24న దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఈ ఏడాది జాతరకు గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది ప్రభుత్వం.

## జైపూర్‌లో రాజ్యసభకు సోనియా నామినేషన్

మేయిన్ పేజీ తరువాయి..

ఆమె జైపూర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. సోనియా వెంట రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ ), మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్, ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ ఉన్నారు. రాజస్థాన్‌లో 10 రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్రంలోని మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో తమ బలాబలాల ప్రాతిపదికన అధికార బీజేపీకి రెండు, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఒక సీటు దక్కనుంది. బీజేపీ అభ్యర్థులుగా మాజీ మంత్రి చున్నిలాల్ గరాసియా, మాజీ ఎమ్మెల్యే మదన్ రాథోడ్‌లను ఎంపిక చేసింది. రాష్ట్ర అసెంబ్లీలో 200 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి 115, కాంగ్రెస్‌కు 70 సీట్లు ఉన్నాయి. పోటీ జరిగినప్పుడు ఒక రాజ్యసభ సీటును గెలుచుకోవడానికి కనీసం 67 ఓట్లు అవసరం. కాగా సోనియా.. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. 1998-2022 మధ్య దాదాపు 22 సంవత్సరాలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి ఐదుసార్లు లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆమె రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే రాయ్‌బరేలీ నుంచి ఈసారి ప్రయాంకాగాంధీ పోటీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనలేదు. అయితే ఈసారి ఆ స్థానం నుంచి సోనియా తప్పుకోవడం వల్ల ప్రియాంకకు లైన్‌క్లియర్ అయినట్టుగా తెలుస్తోంది. రాయ్‌బరేలీ కాంగ్రెస్‌కు కంచుకోటలాంటిది. దీంతో ప్రియాంక ఇక్కడ ఈజీగా గెలిచే అవకాశం ఉంటుంది.



## రాజ్యసభకు రేణుక చౌదరి

మేయిన్ పేజీ తరువాయి..

దీంతో పెద్దల సభలోకి యువకుడు అనిల్ కుమార్ యాదవ్ అడుగుబెట్టనున్నారు. అయితే.. వివిధ రాష్ట్రాలలో ఫిబ్రవరి 27న జరగనున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల తొలి జాబితాను అధికారికంగా విడుదల చేసింది . సోనియా గాంధీ, డాక్టర్ అఖిలేష్ ప్రసాద్ సింగ్, అభిషేక్ మను సింఘ్వి, చంద్రకాంత్ హండోర్, అజయ్ మాకెన్, డాక్టర్ సయ్యద్ నసీర్ హుస్సేన్, జిసి చంద్రశేఖర్, అశోక్ సింగ్, రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్ వంటి కీలక వ్యక్తులతో సహా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నామినేషన్లను ధృవీకరించింది. రాజస్థాన్ నుండి సోనియా గాంధీ, బీహార్ నుండి డాక్టర్ అఖిలేష్ ప్రసాద్ సింగ్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదించారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి అభిషేక్ మను సింఘ్వి, మహారాష్ట్ర నుంచి చంద్రకాంత్ హందోరే నామినేట్ అయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రముఖ రాజకీయ నాయకురాలు, ఆమె ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు పదే పదే ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ నామినేషన్లు వచ్చాయి. 2018లో బీహార్ నుంచి



రాజ్యసభకు ఎన్నికైన అఖిలేష్ ప్రసాద్ సింగ్, ప్రస్తుతం డిసెంబర్ 5, 2022 నుంచి బీహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.మహారాష్ట్ర ప్రభుత్వంలో సామాజిక న్యాయ శాఖ మాజీ మంత్రి చంద్రకాంత్ హందోరే మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు.అదనంగా, కాంగ్రెస్ కర్ణాటక నుండి అజయ్ మాకెన్, డాక్టర్ సయ్యద్ నసీర్ హుస్సేన్, జిసి చంద్రశేఖర్‌లను నామినేట్ చేసింది. మధ్యప్రదేశ్ నుండి అశోక్ సింగ్, తెలంగాణ నుండి రేణుకా చౌదరి, %వీ% అనిల్ కుమార్ యాదవ్ పేర్లు ఖరారయ్యాయి.. నామినేషన్ పత్రాల దాఖలుకు చివరి రోజు ఫిబ్రవరి 15, ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 27న వెల్లడికానున్నాయి. ఉత్తరప్రదేశ్‌తో సహా 15 రాష్ట్రాల్లో 56 స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్‌కు గడువు విధించింది ఎన్నికల సంఘం.. ప్రస్తుత రాజ్యసభ ఎంపీల పదవీకాలం ఏప్రిల్‌తో ముగియనుంది.

## తెలంగాణలో కొనసాగుతున్న బదిలీల పర్వం

మేయిన్ పేజీ తరువాయి..

మంగళవారం 40 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ వెంటనే బుధవారం మరో 74 మందిని ప్రభుత్వం బదితీ చేస్తు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర పురుపాలక శాఖ.. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేపట్టింది. ప్రభుత్వం తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో కూడా భారీగా బదిలీలు చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖలో మొత్తం 105 మంది అధికారులను బదిలీ చేశారు. సోమవారం జారీ చేసిన ఉత్తర్వులతో సీఈవో, డీఆర్డీవో, అడిషనల్ డీఆర్డీవో, డీపీవోలను బదిలీ చేశారు. 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లును తెలంగాణ అబ్కారీశాఖలో బదిలి చేశారు. ఇద్దరు ఉప కమిషనర్లతో పాటు 9 మంది సహాయ కమిషనర్లకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 132 మంది తహశీల్దార్లు బదిలీ అయ్యారు. వారితో పాటు 32 మంది డిప్యూటీ కలెక్టర్‌లు (ఆర్డీవో) లు బదిలీ చేశారు.

## బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఏలేటి

మేయిన్ పేజీ తరువాయి..

శాసనమండలి పక్ష నేతగా ఏవీఎన్ రెడ్డిని ఎంపిక చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే ఎవరిని శాసనసభా పక్ష నేతగా నియమిస్తారనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం పూర్తైన తర్వాత బీజేపీ పక్షనేతను ఎంపిక చేస్తారని భావించారు. కానీ బీజేపీ మాత్రం ఈ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. బీజేపీ నుంచి గెలిచిన ఏడుగురు సభ్యుల్లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సీనియర్. ఆయన 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఆయననే బీజేఎల్పీ నేతను చేస్తారని ప్రచారం జరిగింది. 2023 ఎన్నికల ముందు వరకు రాజాసింగ్ ను కొంతకాలం పార్టీ సస్పెండ్ చేసింది. నిత్యం వివాదాల్లో ఉండే ఆయన ఆ తర్వాత ఏ పార్టీలోనూ చేరలేదు. బీజేపీ అధిష్టానం తనను తిరిగి పార్టీలోకి తీసుకుంటుందని వేచి చూశారు. రాజాసింగ్ భావించిన విధంగానే కాషాయ పెద్దలు ఆయనపై కరుణ చూపారు. ఆయనపై విధించిన సస్పెన్షన్ ను ఎత్తివేశారు. ముచ్చట మూడోసారి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కానీ ఆయనకు బీజేఎల్పీ నేత బాధ్యతలు మాత్రం అప్పగించకపోవడాన్ని కారణమేంటనే చర్చ జరుగుతోంది. నిర్మల్ నుంచి గెలిచిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయాల్లో సీనియర్ నాయకుడు. చాలా కాలం కాంగ్రెస్ లో ఉన్న ఆయన .. అసెంబ్లీ ఎన్నికలకు కొంతకాలం ముందు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ శాసనసభా పక్ష నేత ఎంపిక విషయంలో తొలి నుంచి ఆయన పేరు తెరపైకి వచ్చింది. సీనియర్ నేత ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించాలని బీజేపీ పెద్దలు భావించారు. కామారెడ్డి నుంచి గెలిచిన వెంకటరమణారెడ్డి పేరు కూడా బీజేఎల్పీ నేత ఎంపికలో పరిశీలనలోకి వచ్చింది. మాజీ సీఎం కేసీఆర్ పై గెలిచిన ఆయనకే శాసనసభ పక్ష నేత పదవి ఇవ్వాలనే చర్చ జరిగింది.

## కేసీఆర్ మాట్లాడిన తీరుపై చర్చించేందుకు సిద్ధమేనా ?

మేయిన్ పేజీ తరువాయి..



సబబు కాదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్యాంట్ ఊడపీకారని, ఉన్న అంగీని కూడా ప్రజలు పీకేస్తారన్నారు. ముఖ్యమంత్రిని ఏం పీకడానికి వెళ్లారని అనడంపై రేవంత్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిన్న నల్గొండలో బీఆర్ఎస్ నిర్వహించిన సభలో కేసీఆర్ మాట్లాడిన తీరుపై చర్చించేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ప్రతిపక్ష నేత వస్తే.. రేపు సాయంత్రం వరకూ చర్చించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామన్నారు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం లేదన్నారు. మేడిగడ్డపై ప్రజలకు సమాధానం చెప్పలేక కేసీఆర్ ఫాంహౌస్ లో పడుకున్నారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ చూడటానికి మేడిపండులా ఉందని దుయ్యబట్టారు. మేడిగడ్డ కుంగిపోతే నీళ్లు నింపడం ఎలా సాధ్యమవుతుందని బీఆర్ఎస్ సభ్యుల్ని ప్రశ్నించారు. నీటిపారుదల శాఖ మంత్రులుగా పనిచేసిన హరీష్ రావు, కేసీఆర్ లకే మేడిగడ్డ బాధ్యతల్ని అప్పగిస్తామని, మేడిగడ్డలో నీళ్లు నింపి.. అన్నారం, సుందిళ్లలో నీళ్లు ఎలా పోస్తారో చేసి చూపించాలని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ వీధి నాటకాలు ఆడుతున్నారని, చర్చకు రావడానికి భయమేసే మేడిగడ్డను చూడటానికి రాలేదని దుయ్యబట్టారు.అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 నెలలైనా పూర్తి కాకుండానే ఆరు గ్యారెంటీలపై అబద్ధాలు చెప్పామనడం సరికాదన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, నిరుద్యోగ భృతి, లక్షరూపాయల రుణమాఫీ హామీలను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గాలికి వదిలేసిందని విమర్శించారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీలను చేసి చూపిస్తామన్నారు. ప్రజలు రెండేళ్లు అవకాశమిచ్చినా.. విద్యను, వైద్యను గాలికి వదిలేసి, నిరుద్యోగులను మోసం చేసి, రైతులను నిట్టనిలువునా ముంచేసిన ఘనత బీఆర్ఎస్ కే దక్కుతుందన్నారు. మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ దే నని ఎమ్మెల్యే రాజగోపాల్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చేసి చూపిస్తామన్నారు. దమ్ముంటే కేసీఆర్ ను అసెంబ్లీకి రమ్మనండి అని అడిగితే.. పారిపోతారని విమర్శించారు. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.

# కేసిఆర్‌ను దూషిండడమే పనిగాపెట్టుకున్నారు

రేవంత్ రెడ్డి హుందాతనం మరిచారు

ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు

ప్రజల సంక్షేమం గాలికి వదిలేసారు

మా గొంతు నొక్కేప్రయత్నం చేస్తున్నారు

తెలంగాణభవన్‌లో మీడియాతో ఎమ్మెల్యే కడియం

ప్రభుత్వం కావాలనే మా గొంతు నొక్కుతోంది

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం

అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చారు

సీఎం రేవంత్‌పై ఎమ్మెల్యే పల్లా ఫైర్

కాంగ్రెస్ వైఖరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం

శాసనసభ ప్రాంగణంలో నిరసన

హైదరాబాద్,ఫిబ్రవరి14: సీఎం రేవంత్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజల సంక్షేమం గాలికి వదిలేసారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసిఆర్ ను విమర్శించడానికి, దూషిండడమే పనిగా పెట్టుకున్నాడన్నారు కడియం శ్రీహరి. రేవంత్ రెడ్డి హుందాతనం మరిచి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం అయ్యారు%ా% ఆయన భాష మారుతుంది అని ఆశించామని కడియం శ్రీహరి అన్నారు. కానీ కేసీఆర్ ను అసభ్య పదజాలం తో మాట్లాడుతున్నాడు రేవంత్ రెడ్డి అని ఆయన ధ్వజమెత్తారు. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని, మాకు మైక్ ఇవ్వాలని అడిగాం కానీ ఇవ్వకుండా మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మమల్ని తిట్టించడానికే సభ నడిపిస్తున్నట్టు ఉన్నారని, దీనిపై అసెంబ్లీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు కడియం శ్రీహరి. మీడియా పాయింట్ లో మాట్లాడుదాం అంటే పోలీసులను పెట్టీ అడ్డగించారని, కంచెలు తెలంగాణ లో లేవు అంటూ గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ అసెంబ్లీ ఇనుప కంచెలు వేసి అడ్డుకున్నారన్నారి కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్ ముందు కంచెలు బద్దలు కొట్టామని గొప్పలు చెప్పుకుంది కానీ.. అసెంబ్లీ లో ఎందుకు కంచెలు పెట్టారు..? అని ఆయన అన్నారు. అంతకు ముందు అసెంబ్లీలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గోరంతను కొండంత చేయొద్దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హితవు పలికారు. ఓట్ ఆన్ బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో



ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా అనేక రిజర్వాయర్లు వచ్చాయి. దానికి అనుబంధంగా ఎన్నో ప్రాజెక్ట్‌లు నిర్మించుకున్నాం. నీటి నిల్వ నిల్వ సామర్థ్యం పెరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభలో అధికార కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తమ గొంతు నొక్కుతోంది అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా శాసనసభ వ్యవహారాల మంత్రిగా పనిచేశాను. అసెంబ్లీ సమావేశం నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాట్లాడవద్దనే నిబంధన ఏదీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే మా గొంతు నొక్కుతోంది. సీఎం రేవంత్ ఎన్ని రోజులైనా మాట్లాడండి అవకాశం ఇస్తామన్నారు. మేము మాట్లాడితే తట్టుకోలేక పోతున్నారు. సీఎం చెప్పేదొకటి చేసేదొకటి. అసెంబ్లీ ఆవరణ సభ్యుల హక్కు.. నియంత్రణ ఎలా పెడతారు. ఇలాంటి వాటిని తట్టుకుంటాం.. పోరాడతాం అని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ ఎమ్మెల్యే, దళిత నాయకుడు కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన అనుచిత భాషను వెంటనే రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కడియం సీనియర్ ఎమ్మెల్యే.. ఆయన ఎక్కడా బడ్జెట్‌కు సంబంధం లేని విషయాలు మాట్లాడలేదన్నారు. సీఎం రేవంత్ ఇష్టమొచ్చిన భాష మాట్లాడుతూ దాన్ని తెలంగాణ భాషగా చెప్పుకుంటున్నాడు. తెలంగాణ భాషను సీఎం అవమానపరుస్తున్నారు అని మండిపడ్డారు.

సెక్రటేరియట్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయనకు తెలంగాణకు ఏం సంబంధం..? అని ప్రశ్నించారు. అక్కడ కేసీఆర్ హయాంలో ప్రతిపాదించిన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలి. రెండు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించింది. అసెంబ్లీలో కంచెల పాలన తెచ్చారు.. మా గొంతు నొక్కుతున్నారు అని పల్లా రాజేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.

అసెంబ్లీలో కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు బయటకు వచ్చారు. కేసీఆర్ నల్గొం సభలో చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బాష పైన బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్దకు వెళ్తుండగా పోలీసులు, మార్షల్స్ వారిని అడ్డుకోవడంతో భారాస ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేసి.. వారితో వాగ్వాదానికి దిగారు. సభ జరుగుతున్నప్పుడు మీడియా పాయింట్ వద్దకు అనుమతులు ఉండవని పోలీసులు చెప్పగా.. ఆ ఉత్తర్వులు చూపాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా పాయింట్ వద్ద వెళ్లే అవకాశం లేదా? అని వారు ప్రశ్నించారు. బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేల గొంతు నొక్కి.. ఎమ్మెల్యేలపై ఆంక్షలు ఎందుకని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇక్కడ ఎందుకు 3-4వేల మంది పోలీసులను మోహరించారని ఆరోపించారు. మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు అనుమతి ఇస్తారా లేద కంచెలు బద్దలు కొట్టాలా? అని పాడి కౌశిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతు రుణమాఫీ ఎప్పటిలోపు పూర్తిచేస్తారు?

మొదటిపేజీ తరువాయి..

ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గోరంతను కొండంత చేయొద్దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హితవు పలికారు. ఓట్ ఆన్ బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా అనేక రిజర్వాయర్లు వచ్చాయి. దానికి అనుబంధంగా ఎన్నో ప్రాజెక్ట్‌లు నిర్మించుకున్నాం. నీటి నిల్వ నిల్వ సామర్థ్యం పెరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలతో తెలంగాణలో పెద్ద ఎత్తున పంటలు పండుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉందని చెప్పారు. మేడిగడ్డ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డపై ప్రభుత్వం పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీని వెంటనే రిపేరు చేయాలన్నారు. ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే మరమ్మతులు చేసుకోవాలేగానే ప్రాజెక్టే సరి కాదన్నట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సభలో కోరం లేదంటూ భారాస అభ్యంతరం తెలిపింది. సమావేశాల నిర్వహణకు అవసరమైన సభ్యులు ఉన్నారని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తమ పార్టీ తరపున సరైన సంఖ్యలో సభ్యులు ఉన్నప్పటికీ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లేలా భారాస సభ్యులు వ్యవహరిస్తున్నారన్నారు. సభను 10 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా.. ఆరు నిమిషాలు ఆలస్యంగా మొదలుపెట్టడం సరికాదని భారాస ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కేవలం పది శాతం మంది సభ్యులు ఉంటే కోరం సరిపోతుందని.. అన్నీ తెలిసినా మాజీ మంత్రి హరీశ్‌రావు బుల్ డోజ్ చేస్తున్నారని శ్రీధర్‌బాబు ఆరోపించారు. తమకు వేరే ఉద్దేశాలేమీ లేవని.. సభ నిర్వహణకు సహకరిస్తున్నామని భారాసకు చెందిన మరో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అధికార పార్టీ సభ్యులను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. బడ్జెట్‌పై చర్చ జరుగుతుంటే సీఎం, డిప్యూటీ సీఎం సభలో లేరని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. తమతో పాటు అధికారులు కూడా ఉన్నారని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. డిప్యూటీ సీఎం వచ్చాక వివరణ ఇస్తారన్నారు. అనంతరం చర్చను కొనసాగించారు.

# మాతృభాషను రక్షించుకోవాలి

మొదటిపేజీ తరువాయి..

మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి తమ మాతృభాషను రక్షించుకోవాలని ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలకు మాతృభాషను నేర్పించాలని ఇతర భాషలపై మోజు పెంచుకోవాలి తప్ప తమ మాతృభాషను చంపుకోకూడదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా కేంద్రప్రభుత్వం మన దేశంలో ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఇంకా నెలకొని ఉన్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక సంస్థలు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా దేశంలో నిరక్షరాస్యతను పారద్రోలి అక్షరాస్యతను పెంచడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఇదే సమయంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని అందులో ప్రాంతీయ భాషలకు కూడా ప్రాధాన్యాన్ని కల్పించడం జరిగిందని ఎవరైనా తమకు నచ్చిన మాతృ భాషలో చదువుకోవచ్చు పరీక్షలను రాయవచ్చని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా వసంత పంచమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేకువ జాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి జన్మదినం సందర్భం 108 కలశాల జలాలతో అభిషేకం చేశారు. పద్మశాలి సంఘం తరపున అందజేసిన చేనేత పట్టువస్త్రాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## భర్త వేదింపులు భరించలేక భార్య ఆత్మహత్య

**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** భర్త వేధింపులు భరించలేక ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలం రాయికోడ్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలు అగు కందుకూరి భాగ్యమ్మకు గత 12 సంవత్సరాల క్రితం రాయికోడు గ్రామానికి చెందిన కందుకూరి హనుమంతుతో వివాహం జరిగింది వీరికి ముగ్గురు కూతుర్లు సంతానంగా కలరు గత కొన్ని సంవత్సరాలుగా మంచిగానే సంసారం చేసిన తర్వాత భర్త వేధింపులు, అక్రమ సంబంధం పెట్టుకొని తన భార్యను వేధించేవాడు గతంలో కుటుంబసభ్యులు సర్ది చెప్పి సంసారానికి పంపించారు. అయినా కూడా భర్తలో ఎలాంటి మార్పు రాకపోగా మళ్లీ భార్యను వేధింపులు చేయగా అట్టి వేధింపులు భరించలేక బుధవారం ఉదయం 9:30 గంటల సమయంలో భర్త గొడవపడగా భాగ్యమ్మ తన ఇంటిలో చీరతో ఫ్యాన్ కు ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది చూసిన చుట్టూ ప్రక్కల వారు తలుపులు బద్దలు కొట్టి దించి చూడగా అప్పటికే చనిపోయినట్లు మృతురాలి తమ్ముడు మంద శ్రీనివాసులు చేసిన ఫిర్యాదు మేరకు భర్త పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై కురుమయ్య తెలిపారు.



# దళితులపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలి

– జన్వాడ గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలి

– చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్



**చేవెళ్ల ఫిబ్రవరి 14(ప్రజా జ్యోతి):** ఎన్ని చట్టాలు ఉన్నా దళితులపై అఘాయిత్యాలు, దాడులు ఆగడం లేదని చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలం జన్వాడ గ్రామంలో దళితులపై, చర్చీపై ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల దాడులకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా దళితులపై వేధింపులు, దాడులు ఆగడం లేదని మండిపడ్డారు. దళితులపై వివక్ష, వేధింపులు జరుగుతున్న ప్రభుత్వాలు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయని, దళితుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దేశంలో,రాష్ట్రంలో దళితులపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, దాడులు ఆగేవారకు దళిత సంఘాల పోరాటం ఆగదన్నారు. శంకర్ పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో దళితులపై దాడులకు పాల్పడిన వ్యక్తుపై ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులకు అంబేద్కర్ యువజన సంఘాలు అండగా ఉంటామని, వారి పక్షాన పోరాడుతామన్నారు. పోలీసులు విచారణ చేపట్టి వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కొత్తూరు నూతన ఎంపీడీవోగా అరుంధతి

– ప్రస్తుత ఎంపీడీవో శరత్ చంద్రబాబు బదిలీ



**కొత్తూరు ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** రానున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అధికారుల బదిలీల ప్రక్రియ శరవేగంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తూరు నూతన ఎంపీడీవో గా సి హెచ్ అరుంధతి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

## షాబాద్ మండలం మన్మర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణి






**షాబాద్ ప్రజాజ్యోతి ప్రతినిధి(14.02.2024).** లాలన వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో భాను ప్రకాష్ మరియు లాలన వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు ఇందిరా, సుమలత మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసప్పా, అధ్యాపక బృందం కలిసి పిల్లలకు నోట్ బుక్‌లు, ప్యాడ్లు, పెన్స్ ఇవ్వడం జరిగింది. లిపాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసప్ప గారు మాట్లాడుతూ పిల్లలు గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న పిల్లలు మంచిగా చదువుకొని అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని చెప్పారు. పిల్లలకు నోట్ బుక్ లు, ప్యాడ్లూ ఇచ్చినందుకు లాలన వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారికి, భాను ప్రకాష్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, భాను ప్రకాష్ మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచిగా చదువుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి అని 10వ తరగతి లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు భవిష్యత్ లో కూడా వారికి చదువుకోవడానికి సహాయం చేస్తాను అన్నారు.లాలన వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు సుమలత మాట్లాడుతూ పిల్లలు మంచిగా చదువుకుంటే ఈ గ్రామానికి మేము ఇంకా ఎక్కువ సహాయం చేస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాసప్ప మరియు పాఠశాల అధ్యాపక బృందం , యూడబ్ల్యూహెచ్ ఆకృతి ప్రాజెక్ట్ ఎఫ్ ఓ. బి రామకృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఐఐ ఆధ్వర్యంలో అగ్రి టెక్ సౌత్ 2024 సదస్సు




**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి) :** వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) తన సీఐఐ అగ్రి టెక్ సౌత్ 2024 సదస్సు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వేదికగా నాలుగో ఎడిషన్‌ను నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ రంగంలో సుస్థిరాభివృద్ధిని సాధించడం లక్ష్యం. దాంతోపాటు వ్యవసాయ రంగంలో వస్తున్న అత్యాధునిక పరిణామాలపై రెండు రోజుల సదస్సు–అగ్రివిజన్ 2024 కూడా ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ కార్యక్రమం ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ వరకు జరుగుతుంది. ఈ ఎగ్జిబిషన్ ను హైదరాబాద్ లో నిర్వహించి, ప్రతి ఎడిషన్ ను మరింతగా విస్తరిస్తున్నందుకు సీఐఐని తెలంగాణ ప్రభుత్వ ఉద్యానశాఖ సంచాలకులు, ఐఏఎస్ అధికారి కె.అశోక్ రెడ్డి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల భాగస్వామ్యం అవసరమని, వ్యవసాయంలో అత్యాధునిక పద్ధతులు, నూతన ఉత్పత్తులు, సాంకేతిక ఆవిష్కరణలను తెలుసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఐటీ సోదాలపై ఇండియన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ప్రకటన

INDIAN COOPERATIVE CREDIT SOCIETY LIMITED
(Multi State Cooperative Societies Act 2002)

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి) :** ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మా ప్రాంగణంలో జరిగినవి కేవలం ఆదాయపన్ను సోదాలు మాత్రమేనని, ఎక్కడైనా పన్ను ఎగవేతలు ఉన్నాయా అని చూసేందుకు సర్వసాధారణంగా జరిగేవే తప్ప, అందులో ఈడీ తీసుకున్న చర్యలేవీ లేవని ఇండియన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఛైర్మన్ సోజన్ వి.అవిరాచన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీసీఎస్ఎల్‌కు సంబంధించిన మొత్తం బృందం అంతా ఆదాయపన్ను అధికారులకు పూర్తిగా సహకరించిందన్నారు. ఆదాయపన్ను సోదాలు కూడా పూర్తయ్యాయని, ఐసీసీఎస్ఎల్ తన రోజువారీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని, అమాయకులైన ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కొందరు ప్రయత్నించారని అన్నారు. ఐసీసీఎస్ఎల్ అనేది చట్టానికి, పన్నుల వ్యవస్థకు కట్టుబడి ఉండే సంస్థ న్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, ఇతర రుసుములు అన్నింటినీ ఎప్పటికప్పుడే కడుతున్నాం, భవిష్యత్తులోనూ అలాగే చేస్తామని అన్నారు.

## జ్ఞాన భారతి స్కూల్లో ఘనంగా వసంత పంచమి వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి) :** అక్షరాలకు ఆదిదేవత, సకల విద్యా రాణి, విజ్ఞాన సంప్రదాయని సరస్వతి దేవి అని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం అయోధ్య నగర్ లోని జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్లో ప్రముఖ విద్యావేత్త జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్ రావు అధ్యక్షతన వసంత పంచమి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాత నగరంలో మంచి విద్యను విద్యార్థులకు జ్ఞాన భారతి స్కూల్ అందించడం సంతోషమని ఈ పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్, బండ్లగూడ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్ రామ్మోహన్, బహదూర్ పుర ఉప విద్యాధికారి హరినారాయణలు మాట్లాడుతూ ఈ వసంత పంచమి రోజున అందరూ ఆ తల్లిని తప్పక ఆరాధించాలని పుస్తకాలను, గ్రంథాలను, కలాన్ని సరస్వతి దేవి వద్ద పెట్టి పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.ప్రభాకర్ రావు, బీజేపీ సీనియర్ నాయకుడు సుధాకర్ శర్మ, ధీరజ్, రఘు పాఠశాల కరస్పాండెంట్ పి.రమేష్ కుమార్ ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి, లక్ష్మీ నాగకుమారి తదితరులు ప్రసంగించారు.

## సిపి సుధీర్ బాబుకు గాంధీజీ జ్ఞాపిక బహుకరణ

## - అందజేసిన గాంధీ సంస్థల ప్రతినిధి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి) :** జి.సు–ధీర్ బాబు ఐపిఎస్ కమీషనర్ ఆఫ్ పోలీస్ రాచకొండ కమిషనరేట్ నుండి బదిలీపై వెళుతున్న సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.సుధీర్ బాబుని గాంధీ సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి గాంధీజీ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిబి.కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జి.సుధీర్ బాబు పోచంపల్లి రాష్ట్రపతి సందర్శన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వారిని గాంధీజీ జ్ఞాపికతో సత్కరించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ సంస్థల పర్యావరణ విభాగం రాష్ట్ర కార్యదర్శి టి.సురేందర్ రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సిపిని మర్యాదపూర్వకంగా కలిసి గాంధీజీ జ్ఞాపికను అందజేశారు.



## శ్రీ అలివేలు మంగ సతీ సమేత
# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు





**ఆమనగల్ ప్రతినిధి ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** ఆమనగల్ మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో శ్రీ అలివేలు మంగ సతీసమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మొదటి రోజున గణపతి పూజ అంకురార్పర భద్ర మండల పూజా కార్యక్రమాలు వేద పండితులు నవీన్ శర్మ గారి ఆధ్వర్యంలో అలివేలుబొంగ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన బ్రహ్మోత్సవ కార్యక్రమంలో గ్రామ నాయకులు గోదావరి దేవి సత్యం శివాజీ భీమయ్య యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన సరస్వతి దేవాలయంలో వసంత పంచమి మహోత్సవాలు

– విద్యారణ్య భారతి స్వామీజీ కరకమలములచే అక్షరాభ్యాసం

– ఆలయ ఫౌండర్ సదా వెంకట్ ప్రత్యక్ష పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలు





**యాచారం, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని నందివనపర్తిలో బుధవారం జ్ఞాన సరస్వతి దేవాలయంలో వసంత పంచమి మహోత్సవాలు ఆలయ ఫౌండర్ సదా వెంకట్ ప్రత్యక్ష పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అభిషేకం అలంకరణతోపాటు విద్యారణ్య భారతి స్వామీజీ కరకమలములచే సుమారు 350 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, పదవ తరగతి విద్యార్థులచే సరస్వతి హెూమం, విద్యార్థులచే పల్లకి సేవ ఉత్సవ ఊరేగింపు, భక్తులకు ప్రజలకు అన్న ప్రసాద వితరణ ఇతర విశేష కార్యక్రమాలు నిర్వహించారు. విద్యారణ్య భారతి స్వామీజీ మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలో మానవ జీవితానికి ఎన్ని సుగుణాలు ఉన్నప్పటికీ ఏకాగ్రత జ్ఞాపకశక్తి ఉండాలన్నారు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునేలా అవసరమైన మెలకువల్ని సూచిస్తూనే దేశానికి, ధర్మానికి మంచి పౌరులు కావాలన్నారు. కార్యక్రమంలో సమన్వయ మండల సభ్యులు, సంగెం గణేష్, రాఘవేంద్ర శర్మ, మూడెడ్ల వెంకటరెడ్డి, జలంధర్ రెడ్డి శివకుమార్ నిఖిల్ కుమార్, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

## చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ
## ఇంచార్జ్ పామెనా భీమ్ భరత్‌ని కలిసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు

**షాబాద్ ప్రజా జ్యోతి ప్రతినిధి (14.02.2024)** చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెనా భీమ్ భరత్ ని కలిసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలులితన నివాసంలో షాబాద్ మండలం ముందెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య మరియు మల్లారెడ్డి గూడ మందుగుల మాణిక్యం సీతారాంపురం డి. శ్రీనివాస్ డి.యాదయ్య వి. రాజేందర్ గార్లు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.



## చేగూర్‌లో ఘనంగా సాయి బాబా మందిరం 15వ వార్షికోత్సవ వేడుకలు

– హాజరైన ఆలయ ధర్మకర్త మాజీ జెడ్పీటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి

**కొత్తూరు ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** నందిగామ మండల పరిధిలోని చేగూర్ సాయి బాబా మందిరం 15వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రబుల్ షూటర్ మాజీ జెడ్పీటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి విచ్చేసి వేడుకల్లో పాల్గొని స్వామి వారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలు జరిగిన తీరును పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులును ఆయన అభినందించారు.అనంతరం ఆలయ ఆవం-ణలో భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచనపల్లి రాజు, మంకాల శ్రీశైలం,ఆవుల శివశంకర్, జంగయ్య ,దర్శన్, కావలి, నరసింహులు, మంగలి చంద్రమౌళి, రాజయ్య, మంగళగిరి తదితరులు పాల్గొన్నారు.



## మోడీ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

– మండల బిజెపి అధ్యక్షులు తాండ్ర రవీందర్ – కుర్మిద్దలో గావ్ ఛలో అభియాన్ కార్యక్రమం



**యాచారం, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** గావ్ ఛలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కుర్మిద్దలో బిజెపి మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించి జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. రవీందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తోనే ప్రచారం చేపట్టాలని మరోవైపు పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల అభివృద్ధి ప్రధాని మోడీ తోనే సాధ్యమని ప్రజలకు వివరించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలిసి మరో మారు మోడీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి సాటు మల్లేష్, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

– జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

– మల్కాపూర్ గ్రామంలో పంటల నమోదు ప్రక్రియ పరిశీలన



**చేవెళ్ల ఫిబ్రవరి 14(ప్రజా జ్యోతి):** పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తున్న యాసంగి సీజన్ పంటల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి తులసితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యసాయ అధికారి గీతారెడ్డి మాట్లాడుతూ.. పంటలు పండించే ప్రతి రైతు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వేసిన ప్రతి పంటలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ లో ఏఈఓ లు నమోదు చేస్తున్నారని,లేని యెడల ధాన్యం కొనుగోలు తదితర ప్రభుత్వ సౌకర్యాలు కోల్పోతారని, ప్రతి ఒక్కరూ విధిగా ఆన్‌లైన్ పంటల వివరాలను పొందుపర్చుకునే విధంగా కృషి చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి వరుణ్, రైతులు నవపేట్ కాంతిరెడ్డి, శేరి మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## రేపు దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

– సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పనిచేసే కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా వేతనాలను అమలు చేయడం లేదని సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ విమర్శించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రేపు జరగనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై జయప్రదం చేయాలని కోరుతూ లోయపల్లిలో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను కాల రాసిందని పోరాడి సాధించుకున్న చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తుందని అన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేదలపై మోయలేని భారాలు మోపి వారి జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఈనెల 16 న జరిగే సమ్మె, బంద్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక యునియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

**మెట్ పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 14 ( ప్రజాజ్యోతి) :** ఫిబ్రవరి 16న జరిగే దేశం యొక్క కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, మున్సిపల్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజా,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందున ఫిబ్రవరి 16వ తేదీన దేశంలో ఉన్న కేంద్ర కార్మిక సంఘాలు అన్ని కూడా కలిసి దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ ను చేపట్టడం జరిగిందని ఈ సమ్మెను విజయవంతం చేయాలని మెట్ పల్లి మున్సిపల్ ముందర కార్మికులతో కలిసి వాల్ పోస్టర్లు ఆవిష్కరించి సమ్మె గురించి మాట్లాడడం జరిగింది. దేశంలో మోడీ వచ్చిన తర్వాత కార్మికులపై దాడి మొదలు పెట్టాడని పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు కోడ్ లుగా చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి 700 మంది రైతుల చావుకు కారకుడు అయ్యాడని కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానం గా చేస్తూ,నరేంద్రమోదీ ప్రభుత్వం కొడులను తీసుక వస్తున్నాడని మండి పడ్డారు. కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని 18 డిమాండ్ల పైన ఈ సమ్మె జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, శ్రీకాంత్, మధురమ్మ, ఇబ్రహీం, మహేష్, శంకరమ్మ లతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

### ఆమనగల్ కమిషనర్ బదిలీపై వెళ్ళుచున్న నేపథ్యంలో

## కన్నీరు మున్నీరు అయినటువంటి మున్సిపల్ సిబ్బంది





**ఆమనగల్ డిసెంబర్ 14 ప్రతినిధి. ప్రజా జ్యోతి** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపాలిటీ కమిషనర్ గా గత ఐదు సంవత్సరాల నుండి సేవలు చేసినారని ఆమనగలను పట్టణాన్ని స్వచ్ఛభారత్ కేంద్ర ప్రభుత్వ ఉత్తమ అవార్డు తెచ్చినటువంటి ఉత్తమ కమిషనర్ శ్యాంసుందర్ అని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఆయన వచ్చిన రోజుల్లో ఆమనగలు పట్టణంలో స్వచ్ఛభారత్ లోపించి అన్ని వార్డులలో లో పరిసర శుభ్రత లోపించి అనేకమైన రోగాలతో ప్రజలు ప్రభుత్వ దావకానల్లో చికిత్స పొందుతూ ఉన్నారని ఆమనగల్ పట్టణం మున్సిపాలిటీ అన్ని వార్డులను మున్సిపల్ సిబ్బందితో పరిసరాల పరిశుభ్రత ఎలాంటి చెత్తాచెదారం లేకుండా బ్లీచింగ్ పౌడర్ పొడి చెత్త తడి చెత్త గుట్టలను ఏర్పాటు చేసి ప్రజలను ఆరోగ్యం కాపాడినటువంటి కమిషనర్ శ్యాంసుందర్ అనే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రజా ప్రతి నిధులు ఎంతో ఇబ్బంది పెట్టిన వారిని ఢీకొని మా ఉద్యోగ ధర్మం నా కర్తవ్యం నేను చేస్తానని దాని రాజకీయ నాయకులకు దాసోహం కాకుండా ప్రజాక్షేమమే ఆరోగ్యమే పట్టణ అభివృద్ధి నా దేయంగా పని చేస్తానని కేంద్ర ప్రభుత్వంతో ఆమనగలు పట్టణాన్ని స్వచ్ఛభారత్ ప్రథమ బహుమతి పొందినటువంటి కమిషనర్ శ్యాంసుందర్ అనే ప్రజల మనలను పొందుతున్న పొందాలని రాజకీయ నాయకులు సన్మాన కార్యక్రమంలో రాకుండా ప్రజలే నా యొక్క మున్సిపాలిటీ సిబ్బంది విధి నిర్వహణ గ్రహించి నా యొక్క తోటి వార్డు ఆఫీసర్స్ నా యొక్క ప్రేమ నా యొక్క ఉద్యోగ భద్రత గ్రహించి సన్మానం చేసిన వారికి హృదయపూర్వక ప్రేమ అభిమానులని నేను చేసినట్టు పనులు నా ఉద్యోగరీత్యా ఆమనగలను పట్టణాన్ని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వం

– రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి

– ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె బంద్‌ను జయప్రదం చేయాలి




**యాచారం, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** బిజెపి కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడంతోపాటు నిత్యవసర ధరలు తగ్గించాలని కార్మిక కర్షక ఉపాధి హామీ చట్ట రక్షణ కై ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లిలో ఇంటింటా కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి, వ్యకాస జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి నర్సింహా మాట్లడుతూ గతంలో గ్యాస్ ధర రూ. 350 ఉండగా బిజెపి రోడ్డెక్కి గగ్గోలు పెట్టిందని ప్రస్తుతం రూ. 12 వందలు పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలపై పెనుబారం మోపుతుందని అన్నారు. కార్పొరేట్ శక్తులైన అంబాని, అదానిలకు ప్రజల సంపదను దోచుపెడుతూ ప్రజలను మరింత పేదవారిగా మారుస్తుందని మరోపక్క ప్రభుత్వా రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తు కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతోన్మాదా విధానాలకు వ్యతిరేకంగా 16 న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు కావలి జగన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోలే శివ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కంబాలపల్లి విప్లవ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు గుడ్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

– ఆలయ కమిటీ చైర్మన్ విస్లావత్ శ్రీనివాస్ నాయక్



**రాజాపూర్ ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి–భోగ్ భండార్ వేడుకలను గురువారం రాజాపూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలకు రాజాపూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు, గిరిజన నాయకులు, ఎంపీపీ, జడ్పీటిసి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరై సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని రాజాపూర్ మండల సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ విస్లావత్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే ఈ వేడుకల్లో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొననున్నారని విస్లావత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ప్రతి గిరిజన నాయకుడు ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## రాయపోల్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బాలయ్య



**రాయపోల్ ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** రాయపోల్ మండల ప్రజ పరిషత్ అభివృద్ధి అధికారిగా బుధవారం కార్యాలయంలో ఎంపీడీవో గా బాలయ్య బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన మున్నయ్య బదిలీపై నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లా బంటారం మండలంలోని ఎంపీడీవో గా అక్కడ విధులు నిర్వహించిన బాలయ్య రాయపోల్ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల అధికారులు. ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని. ఇందుకోసం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు. ప్రత్యేక అధికారులు. మాజీ సర్పంచులు. ఎంపీటీసీలు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు. నీటి సమస్య. తదితర వాటిని ఎప్పటికప్పుడు చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ లక్ష్మీనారాయణ సీనియర్ అసిస్టెంట్ ముంతాజ్ అలీ ఏపీవో రాములు గ్రామపంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నూతన ఎంపీడీఓ బాలయ్యను సన్మానించిన ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్



**రాయపోల్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి.** రాయపోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాయపోల్ నూతన ఎంపీడీఓగా బాలయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాలయ్య వికారాబాద్ జిల్లా బండారం మండలంలోని ఎంపీడీవోగా పని చేశానని బదిలీలో భాగంగా రాయపోల్ మండలానికి బదిలీపై వచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ తన ఛాంబర్ లో నూతనంగా విధులు చేపట్టిన బాలయ్యను స్వాగతిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో అన్ని గ్రామాలు మరింత అభివృద్ధి సాధించేలా అభివృద్ధికి పాటుపడుతూనే ఉత్తమ అధికారిగా మన్ననలు పొందాలని ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ కోరారు. ఇంతకు ముందు రాయపోల్ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన మున్నయ్య నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ముంతాబ్ అలీ, ఏపీఓ రాములు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా భాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు విధులు నిర్వహించిన కమిషనర్ రాజశేఖర్ సెక్రటేరియట్‌కు బదిలీపై వెళ్లారు.



## కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అక్షరాభ్యాస కార్యక్రమం




**హుస్నాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో బుధవారం వసంత పంచమి ని పురస్కరించుకొని సరస్వతీ పూజ, అక్షర అభ్యాస మహోత్సవం నిర్వహించడం జరిగింది. దీనికి గాను అధిక సంఖ్యలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో హాజరై అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్ లు నూతన విద్యాభ్యాసం ప్రారంభించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్న తూర్పాటి మహేష్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** హుస్నాబాద్ పట్టణ%శీ%లోని బుడిగ జంగాల కాలనీకి చెందిన ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అయిన తూర్పాటి మహేష్ వాస్తు, జ్యోతిష్య శాస్త్రలలో అత్యంత ప్రతిభ కనబర్చిన%శీ%దుకు గాను మహానంది జాతీయ పురస్కారంతో బాటు"వాస్తు విద్యా విభూషణ్ " అనే బిరుదును కూడా అందుకున్నారు. ఈ నెల 11న విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు సాంస్కృతిక సాహితీసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు, వేమన జయంతి ఉత్సవాల సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ గౌరీ శంకర్ పలువురు ప్రజా ప్రతినిధులు, సాహితీ, ఆధ్యాత్మిక, సామాజిక సేవకుల సమక్షంలో పురస్కారాలను అందుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని భార్గవపురం సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టి గోపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు చిట్టి దేవేందర్ రెడ్డి కార్యదర్శి దొడ్డి శ్రీను, రమాదేవి, ఇతర ఉపధ్యాయినులు, దేవరాజు, జగదీశ్వర్, చంద్రమౌళి, లక్ష్మయ్య, సుధాకర రావు, రమేష్, మల్లేశం, 3 టీవీ దాక్షాయని తదితరులు స్థానిక శిశు మందిర్ పాఠశాలలో తూర్పాటి మహేష్ ను ఘనంగా సన్మానించారు.

## బదిలీ పై వెళ్తున్న ఏసీపీకి రామకోటి పుస్తకం అందజేత



**రాయపోల్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** గజ్వేల్ పట్టణంలోగత కొన్ని సంవత్సరాలుగా ఏసీపీ రమేష్ పోలీస్ శాఖలో సేవలందించి బదిలీ మీద వెళ్తున్న సందర్భంగా వారి కార్యాలయం లో మర్యాద పూర్వకంగా ఏసీపీ మడత రమేష్ ను కలిసి రామకోటి పుస్తకాన్ని అందజేసిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ అందరితో ఫ్రెండ్లి పోలీస్ లా ఉన్నాడని, మా రామకోటి నిర్వహించిన ఎన్నో దైవ కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అని అన్నారు

## కాకతీయలో ఘనంగా వసంత పంచమి వేడుకలు




**సిద్దిపేట టౌన్ ప్రజాజ్యోతి :**సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో హైస్కూల్లో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ సరస్వతి దేవి అందరిదని లక్ష్మీ కొందరుదని ఉద్బోధించారు. విద్యార్థులు ఆధ్యాత్మికతతో ,పట్టుదలతో కృషిచేసి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు,విద్య నేర్పిన గురువులకు,సమాజంలో కీర్తిప్రతిష్టలు తెచ్చి ,ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ఇట్టి కార్యక్రమంలో సరస్వతీ శ్లోకాల పోటీలను మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు మరియు విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత,ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం బహుకరణ



**చిన్నకోడూర్ ,ఫిబ్రవరి14 (ప్రజా జ్యోతి):** మండల పరిధి రామునిపట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కవిత కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుగుల రేవంత్ రెడ్డి ఫోటోను .ఎన్. ఎస్ .యు .ఐ జిల్లా అధ్యక్షులు అజ్మత్, ఎన్ .ఎస్ .యు. ఐ గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె మధు,ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఫోటో గ్రామపంచాయతీ కార్యాలయానికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్ .యు .ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీద్ ఆలీ, ఎన్ .ఎస్. యు .ఐ నాయకులు కర్ర మాణిక్యం,రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

– తొగుట ఎస్ఐ లింగం



**తొగుట, ఫిబ్రవరి14(ప్రజాజ్యోతి):** వనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై లింగం పేర్కొన్నారు బుధవారం మండలంలోని వెంకట్రావ్ పేట గ్రామంలో వాహనదారులకు రోడ్డు భద్రత మహోత్సవాలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం మోటార్ సైకిల్ వాహనదారులకు, ప్రజలకు చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు గురించి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి సంవత్సరం భద్రత వారోత్సవాలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు. జరిమానా ఫైన్లు వేయడం మా అభిమతం కాదని ప్రమాదాల నివారణ గురించి రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రమే జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొగుట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించింది

– టీఎంఆర్పీఎస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్




**రాయపోల్ ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** దౌల్తాబాద్ మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి దండోరా సమావేశం బుదవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎంఆర్పీఎస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్ మాదిగ మట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించిందనీ కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు సముచిత స్థానం గౌరవం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మహిళల్లో పోరాట స్ఫూర్తి పెంపొందాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పై మాటిచ్చిన గత పాలకులు మాట తప్పారని మాదిగ దండోరా పోరాటం కేవలం మాదిగల కోసం మాత్రమే కాదు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసమన్నారు. హక్కులు ఆత్మ గౌరవం దక్కేదాక దండోరా పోరాటం కొనసాగుతుందన్నారు. మాదిగలు రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల భుపాల్ మాదిగ, టీఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్దిని రాజమల్లయ్య,టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షుడు జంగపల్లి సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి లింగాల స్వామి, దండు నర్సింలు, కొంపల్లి రాజు,మండల అధ్యక్షుడు జోగు మహేందర్,మండల ఉపాధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి డప్పు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి యాదగిరి,కోశాధికారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డి కాలనీలో కీర్తిశేషులు చల్లారం

## బాలమ్మ జ్ఞాపకార్థం బెంచీల ఏర్పాటు అభినందనీయం



**ప్రజా జ్యోతి: నంగునూరు:–** నంగునూరు మండల%శీ% తిమ్మాయిపల్లి గ్రామంలో రెడ్డి కాలనీలోని సంగం ఆవరణలో కీర్తిశేషులు చల్లారం బాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చల్లారం పద్మారెడ్డి చల్లారం సుధాకర్ రెడ్డి రెండు బెంచీలు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం రాజశేఖర్ రెడ్డి, సభ్యులు దామోదర్ రెడ్డి,భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన సాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు



**నంగునూరు ప్రజాజ్యోతి :** సిద్దిపేట నుండి హన్మకొండ జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో గత ఆరు నెలల క్రితం ఇక్కడ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. అయితే ఇప్పటికీ సవ్యంగా పూర్తి చేయట్లేదు. ఎప్పుడు ఏం చేస్తున్నారో ఎవరికీ అర్థం కావట్లేదు. దీనివల్ల వ్యాపారస్థులమంతా తీవ్రంగా నష్టపోయాం. ఒక క్రమపద్ధతిలో కాకుండా అక్కడక్కడా పనులు ప్రారంభించడంతో ప్రజలు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అవస్థలు పడుతున్నామని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. హైదరాబాద్ నుండి వాహణాల రద్దీ తీవ్రంగా పెరుగుతోంది. దీనికి తోడు మేడారం జాతర సందర్భంగా వివిద ప్రాంతాల వారు వరంగల్ మీదుగా మేడారం లక్నవరం రామప్పకి పర్యాటకుల తాకిడి పెరగడంతో కిలోమీటర్ల మేర వాహణాలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మలుపులు ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు డాంబర్ రోడ్డును తవ్విన కాంట్రాక్టర్లు దాని స్థానంలో కొత్త రోడ్డును నిర్మించడం మరిచి కంకర పరిచారు పలురకాల వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు ఈ కంకర పరిచిన రోడ్డుపై ద్విచక్ర వహనాలపై వెళ్లాలంటే అక్కడ వెలువడుతున్న దూమ్ముతో ఇబ్బందిగా మారుతుంది కొన్ని రోజుల్లోనే మేడారం జాతర జరగనుండగా ఈ జాతరకు ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల నుండి లక్షల మంది తరలి రానుండగా వాహనదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు ఈ విషయం పై స్థానిక అధికారులు కాంట్రాక్టర్ లు వెంటనే ఇప్పటికైనా త్వరగా ఈ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని కోరుకుంటున్న స్థానిక ప్రజలు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ మార్గం గుండా నిత్యం 20 గ్రామాల నుంచి ప్రజలు సిద్దిపేట వైపు వెల్తుంటారు వారి సమస్యలపై స్పందించి పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు వాహనదారులు వ్యాపారస్తులు కోరుకుంటున్నారు.

## ఆర్డీవో కార్యాలయం ముందు పోతారం (ఎస్) గ్రామ దళితులు ధర్నా




**హుస్నాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** ధరణిలో ఉన్న లోసుగులను ఆసరాగా తీసుకొని ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూములను కబ్జా చేయడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట పోతారం (ఎస్) గ్రామా దళితులు ధర్నా చేపట్టారు. గ్రామంలోని 250, 263 సర్వే నంబర్లలో గల 3 ఎకరాల అసైన్డ్ భూమిని కొంత మంది రియాల్టర్లు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా వారి పేరిట చేయించుకుంటున్నారని దళితులు వాపోయారు. తమ తాత ముత్తాతల నుండి సాగు చేసుకుంటున్న భూమిని ఇప్పుడు వచ్చి అక్రమంగా కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి తమ భూములను కాపాడాలని కోరారు.

## దేశ వ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

– ఏఐటీయూసీ బీఓసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్



**చేర్యాల ప్రజాజ్యోతి :** ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బీఓసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. చేర్యాల మండల కేంద్రంలో అంగడి బజారు వద్ద బుధవారం సమ్మె వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా అందె అశోక్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కోడ్ లు తీసుకొచ్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం, ప్రతి కార్మికునికి 26వేల కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యూటీ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, రైల్వే, బొగ్గు లాంటి సంస్థలను ప్రైవేటుపరం చేసి బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి నిరసనగా కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయడానికి అన్ని కార్మిక సంఘాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లం అంజయ్య, పొన్నబోయిన మమత, గజ్జల సురేందర్, గూడెపు సుదర్శన్, కర్రె రవి, నంగి కనకయ్య, దండెబోయిన వెంకటేష్, శిగుళ్ల నరేష్, కొలిపాక భిక్షపతి, లచ్చయ్య, ప్రమీల, రజిత తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని మరింత పటిష్టం చేస్తాం : పాలమూర్ మోదీ శాంతికుమార్



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 14 ( కలం పవర్ న్యూస్ )** భారతీయ జనతా పార్టీ కోసం నిరంతరం క్రమశిక్షణతో పనిచేసే వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని పాలమూర్ మోదీ బండారి శాంతికుమార్ అన్నారు. బుధ వారం బిజెపి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులుగా పి. శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన కార్యక్రమానికి శాంతికుమార్ అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళుతున్నామని రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ పేర్కోన్నారు. రాబోయే రోజుల్లో శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో మహబూబ్ నగర్ జిల్లా బిజెపి పార్టీకి కంచుకోటగా మారుతుందని శాంతికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు డికె అరుణ, జితేందర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## బడ్జెట్‌లో విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించడం బాధాకరం

– సంక్షేమాన్ని సంక్షోభంలో నెట్టేసిన కాంగ్రెస్ పార్టీ

– టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ జహంగీర్



**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 14(ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించి సంక్షేమాన్ని సంక్షోభంలో నెట్టేసిందని టిఆర్ఎస్ పార్టీ వనపర్తి జిల్లా నాయకులు షేక్ జహంగీర్ ఆరోపించారు.బుధవారం ఆయన మాట్లాడుతూ విద్య సమాజ మార్పుకు,అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు.రాష్ట్ర ప్రగతికి ఎంతో దోహదపడే అత్యంత కీలకమైన విద్యారంగానికి ప్రాధాన్యతనిచ్చి బడ్జెట్ కేటాయింపులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.విద్య శాస్త్రీయ,లౌకిక,మానవ ప్రజాస్వామ్య ఆర్థిక అసమానతలు తొలగిస్తుందన్నారు.సమాజంలోని అన్ని రకాల అసమానతలను వర్గ,కుల, లింగ,ఆధిపత్యం తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.అంత కీలకమైన విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.2014 -15 సంవత్సరంలో విద్యారంగానికి సంబంధించిన బడ్జెట్ 10.8% కేటాయింపులు జరగగా..2023-24 లో 6.7 % శాతానికి పడిపోయిందని వెల్లడించారు.రాష్ట్ర ప్రగతికి ఎంతో దోహదపడి అత్యంత కీలకమైన విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్ కేటాయింపులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని,కానీ విద్యారంగాన్ని విస్మరించడం వల్ల విద్యాభివృద్ధి కుంటుబడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి...ప్రజల జీవితాలలో గుణాత్మక మార్పుకు నాంది పలికే విద్యారంగాన్ని విస్మరించడం చాలా బాధాకరమని వాపోయారు.ఇట్టి నిర్ణయం వల్ల నాణ్యవంతమైన విద్య కొరవడి విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందని విమర్శించారు.గత టిఆర్ఎస్ ప్రభుత్వం విద్య మీద ఎంతో చిత్తశుద్ధితో 1000 గురుకుల పాఠశాలలను స్థాపించి నాణ్యమైన ఆహారాన్ని,మంచి విద్యను విద్యార్థులకు అందించిందని తెలిపారు.విద్యాభివృద్ధికి తోడ్పాటు పడాల్సిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈ బడ్జెట్ ద్వారా తేటతెల్లమవుతుందన్నారు.తక్షణమే ఈ ప్రభుత్వం విద్యారంగాన్ని సమీక్షించి,భవిష్యత్తు విద్యావిధానాన్ని రూపొందించడానికి విద్యారంగ మేధావులతో,విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యా కమిషన్ ఏర్పాటుచేసి విద్యారంగంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల కాలం గడుస్తున్న కేవలం టిఆర్ఎస్,కేసీఆర్ విమర్శించడమే తన పనిగా పెట్టుకున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడైనా ప్రజల సంక్షేమం,విద్యార్థుల భవిష్యత్ వైపు దృష్టి సారించి పేద ప్రజల అభివృద్ధి కొరకు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

## జేఈఈ-2024 ఫలితాల్లో జాగృతి విద్యార్థుల విజయకేతనం

**వనపర్తి ప్రతినిధి,ఫిబ్రవరి 14(ప్రజా జ్యోతి):** జేఈఈ-2024 ఫలితాల్లో వనపర్తి జాగృతి విద్యార్థులు వనపర్తి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచి విజయ కేతనం ఎగరవేశారు.జాగృతి కళాశాల విద్యార్థులు కె.స్నేహిత 89.08 శాతం మార్కులతో, అనన్య 84.37మార్కులు,శ్వేత 83.56, జి.కావ్య 80.37 పర్సెంటైల్ తో పాటు..15మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్ కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అంబటి.వినోద్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సాధారణ విద్యార్థులతో ఎటువంటి లాంగ్ టర్మ్ కోచింగ్ లేకుండా రెండేళ్లు క్లాస్ రూమ్ ప్రోగ్రాంలతోనే ఈ ఫలితాలు సాధించడం జరిగిందని పేర్కొన్నారు.మొత్తం 25మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్-2024 పరీక్ష రాయగా..19మంది విద్యార్థులు ఐఐటి-2024 అడ్వాన్స్ కు అర్హత సాధించారని తెలిపారు.మా కళాశాలలో జేఈఈ, ఎన్ఈఈటి, ఎంసెట్ బ్యాచ్ లకు కార్పొరేట్ ప్రోగ్రాం, మెటీరియల్ తో పాటు..25సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులచే ప్రత్యేక కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని,కావున విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జేఈఈ-2024లో ఉత్తమ ఫలితాలు సాధించిన జాగృతి కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్ అంబటి. వినోద్ కుమార్, శ్యామ్ కుమార్, సత్యనారాయణ, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.



### విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో
## పుల్వామా అమర వీర జవాన్లకు కొవ్వొత్తులతో ఘన నివాళు



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలోని పుల్వామాలో ఉగ్రవాదుల మూకల దాడిలో వీర మరణం పొందిన 40 మంది అమర వీర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా కొవ్వొత్తులతో నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వి.భీమ్ రెడ్డి మాట్లాడుతూ పుల్వామా దాడి ఘటన చాలా బాధాకరమని ఉగ్రవాదుల దాడిలో భారత వీర జవాన్లు వీరమరణం పొంది నేటితో ఐదు సంవత్సరాలు పూర్తి అవుతుందని, ఫిబ్రవరి 14న ప్రతి సంవత్సరం వారిని స్మరించుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని అన్నారు. విదేశీ సంస్కృతిలో భాగంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డే రోజున ప్రేమ పేరుతో అశ్లీలతను పెంపొందించి విదేశీ సంస్కృతిని బలవంతంగా రుద్దుతున్న కార్పొరేట్ శక్తుల కుట్రలకు బలి కావద్దని, నేటి యువత దేశం కోసం, ధర్మం కోసం పరితపించేలా ప్రతి ఒక్కరు జాతీయ భావాలు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14 అనేది వాలెంటైన్స్ డే ను బహిష్కరించి అమరవీర జవానుల సంస్మరణ దినంగా జరుపుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు వాకిటి భీమన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ రావు,ధర్మ ప్రచార ప్రముఖ్ జుట్ల హనుమంతు,బజరంగదళ్ జిల్లా సహ ప్రముఖ్ వాకిటి రమేష్,ప్రఖండ ప్రముఖ్ పసుపుల భీమేష్, సహ ప్రముఖ్ రాహుల్, మండల ప్రముఖ్ నరేష్,మూర్తి, రామాంజనేయులు, అక్షయ్, నాగరాజ్, మూర్తి, కార్తీక్, శివ కుమార్, వంశీ,నందు,భరత్,మనీ, సాగర్,అర్జున్, కార్తీక్. చిన్న. తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై కళాశాల విద్యార్థులకు అవగాహన

### ఎస్సై రంజిత్ రెడ్డి



**కౌడిపల్లి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 14** మండల కేంద్రమైన కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్థానిక ఎస్సై శ్రీ రంజిత్ రెడ్డి రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ ఆంక్షలు సైబర్ క్రైమ్ వంటి అంశాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రంజిత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలు పూర్తిగా తెలుసుకోవాలన్నారు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వాహనాలు నడపాలని సూచించారు అలాగే విద్యార్థులు సాధ్యమైనంతవరకు సెల్ ఫోన్ వాడకూడదని కేవలం అవసరం మేరకే వాడాలని సూచించారు ఈరోజుల్లో ఆన్లైన్లో మోసాలు పెరిగాయన్నారు వాటికి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు అదేవిధంగా సైబర్ నేరాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామారావు ఏఎస్ఐ విటల్ సిబ్బంది భాగయ్య ఉపాధ్యాయ బృందం సురేందర్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జలసాధన సభకు జనాలను బస్సులలో
## తీసుకుని వెళ్లడం హాస్యాస్పదంగా ఉంది

### తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి జి జనార్ధన్



**పెద్ద శంకరంపేట్ ప్రజా జ్యోతి:** నారాయణఖేడ్ నియోజకవర్గం నుండి జలసాధన సభకు మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి జనాలను బస్సులో తీసుకెళ్లడం హాస్యస్పందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. తమ నియోజక వర్గంలో సాగు,తాగు నీరు తేలేని మాజీ ఎమ్మెల్యే నల్గొండకు పోయి ఎం తెస్తారని, సింగూర్ నీళ్ళను ఆనాటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు తీసుకుని వెళ్లిన నాడు నోరు మెదపలేదని ఆయన ఎద్దేవా చేశారు .గత పదేళ్లుగా బి ఆర్ ఎస్ ప్రభుత్వం వందల అబద్దాలతో ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తూ దోపిడీ చేస్తూ! ఈరోజు నల్గొండలో సభ పెట్టి మళ్ళీ ప్రజలను రెచ్చగొట్టడం తప్ప సాధించేది ఏమీ లేదు అని, తెలంగాణ ప్రజలు నిజాలను గ్రహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఇది రాజకీయ సభ కాదంటూనె, రాజకీయాలు మాట్లాడుతూ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తూన్నారని, కనీసం ఒక వంద రోజులు ఓపిక పట్టలేక, ఏవేవో మాట్లాడుతున్నారని, అసెంబ్లీకి పోనీ మాజీ ముఖ్యమంత్రి, నల్గొండలో జల సాధన సభ ఏర్పాటు చేసి, రెచ్చ గొట్టె మాటలు మాట్లాడుతూ!మల్లొక్కసారి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయుటకు పాల్పడుతున్నారని ,. నారాయణ ఖేడ్ లో ఎంఎల్ఏ సీటు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది.ఎంపి సీటు కూడా కాంగ్రెస్ పార్టీయే గెలవబోతుందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణాలో పదహారు సీట్లు గెలవడం కాయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేందర్ గౌడ్, జె నారాయణ గౌడ్, ఆర్యన్ సంతోష్, గంగారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు జయపాల్ గౌడ్, టౌన్ యూత్ అధ్యక్షుడు భానుచందర్ గౌడ్, సంగమేశ్వర్ సెట్, జాంగిర్, విట్టల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

### శివ స్వాముల సన్నిధానం
## ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి





**కౌడిపల్లి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 14** మండల పరిధిలోని వెంకట్రావు పేట గ్రామంలో బుధవారం రోజున శివ స్వాముల సన్నిధానం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ వైస్ చైర్మన్ నైముద్దీన్ జడ్పిటిసి కవిత అమర్సింగ్ ఎంపిటిసి సాజిదా పాషా మాజీ సర్పంచ్ నాజియా సలావుద్దీన్ నాయకులు కొండల్ రెడ్డి షేకులు సత్యం లింగం దుర్గయ్య రాజు కుతుబుద్దీన్ శివ స్వాములు సుధాకర్ రామాంజనేయులు వెంకటేష్ కృష్ణ సాయి తదితరులున్నారు.

## అనుమానంతో కత్తితో దాడి వ్యక్తి మృతి



**శివంపేట ప్రజాజ్యోతి:** తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అని అనుమానంతో సదరు వ్యక్తి పై కోపం పెంచుకొని కత్తితో దాడి చేసి హత్య చేసిన సంఘటన శివంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, వివరాలలోకి వెళ్తే ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఉసిరిక పల్లి గ్రామానికి చెందిన ఎరుకల నరసింహులు ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు,అదే గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేష్(30) అనే వ్యక్తి తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకుని సన్నిహితంగా ఉంటున్నాడని అనుమానం పెంచుకున్న ఎరుకలి నర్సింలు మంగళవారం రాత్రి 11 గంటలకు కత్తితో దాడి చేసి పొడిచి హత్య చేశాడని తెలిపారు,ఈ విషయమై ఎరుకలి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు,

## పుల్వామా అమరవీరులకు నివాళులు



**జనగామ, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):-** 2019 ఫిబ్రవరి 14 న జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారత భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న వాహనాల కాన్వాయ్‌పై జరిగిన ఉగ్ర దాడిలో40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. ఆనాటి ఉగ్రదాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు జనగామ బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మంతెన మని, చుంచు శ్రీకాంత్, భీమ్ రాజు, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 14, (ప్రజాజ్యోతి):** సేవా కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికుడు, టీడీపీ గౌతం నగర్ డివిజన్ అధ్యక్షుడు పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజా శ్రీనివాస్ నగర్ లో పేద మహిళలకు అవసరమైన పెసర పప్పు తదితర నిత్యావసర సరుకులు పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు సేవ చేయడంలోనే తనకు నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రూ తమకు ఉన్న దానిలో కొంత డబ్బు అయి నా, పేదల సంక్షేమానికి వెచ్చించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహి ళలు పాల్గొన్నారు



## అంబేద్కర్, ధ్యాన్ చంద్, శివాజీ చౌరస్తాలను సుందరీకరిస్తా

- ఏడుపాయల దేవస్థానంలో పక్కా షెడ్‌ల నిర్మాణం
- ఎంఎస్ఎస్ఓ సేవలు - నిరంతరంగా కొనసాగుతాయి
- రోడ్డు ప్రమాదాలపై ఎస్పితో చర్చిస్తా - మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**మెదక్ ప్రతినిధి ప్రజాజ్యోతి :** మెదక్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ధ్యాన్ చంద్ చౌరస్తాతో పాటు శివాజి చౌరస్తాలను అత్యాధునిక హంగులతో నిర్మాణం చేపడ్తామని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ పట్టణంలో అత్యాధునిక వసతులతో పాటు స్వాగత తోరణం గా వెల్ కం టు మెదక్ లైటింగ్ బోర్డుతో పాటు ఐ లవ్ మెదక్ లైటింగ్ బోర్డులతో మెదక్ పట్టణాన్ని అత్యద్భుతంగా తీర్చిద్దుతానని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా మెదక్ పట్టణంలో పిల్లలు ఆడుకునేందుకు ఉన్నటువంటి చిల్డ్రన్స్ పార్క్ లో మిషన్ భగీరథ ఉన్నందున దానిపై వెంటనే చర్చించి పిల్లలు ఆడుకునే విధంగా ఆహ్లాదంగా చిల్డ్రన్స్ పార్క్ ను త్వరలోనే ప్రారంభిస్తానని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా ఎం.ఎస్.ఎస్.ఓ. ఆధ్వర్యంలో ఎప్పటిలాగే సేవలందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జానకీ శ్రీరాం, మాజీ మున్సిపల్ చైర్మెన్ కొండన్ సురేందర్ గౌడ్, కౌన్సిలర్ లు దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, దాయర లింగం, ఆవారి శేఖర్, న్యాయవాది జీవన్ రావ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్నా, బొంబాయి ఆరీఫ్, తాహేర్, సాధిక్, ఎస్.డి. క్రిష్ణ, అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హపీజ్ మోల్సాబ్, మంగ మోహన్ గౌడ్, వివిధ మండలాల నాయకులు శంకర్, శేరి మహేందర్ రెడ్డి, లక్కరు శ్రీనివాస్, పరుశు రాం, నాగిరెడ్డి, అక్బర్, పద్మ మనోజ్ కుమార్, సూఫి, సంగమేశ్వర్, గూడూరి క్రిష్ణ, శ్రీనివాస్, జిలకరి రాజలింగం తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

**వనదుర్గమ్మ వద్ద పక్కా షెడ్ ల నిర్మాణం**

**ఏడుపాయల దేవస్థాంలో పక్కా షెడ్ ల నిర్మాణం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత దేవస్థానం ను ప్రత్యేక నిధులతో అభివృద్ధి పర్చుతానని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకోని భక్తులకు రూ. 80 లక్షల వ్యయంతో పక్కా షెడ్ ల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తానని ఆయన హామినిచ్చారు.

**రోడ్డు ప్రమాదాలపై ఎస్పితో చర్చిస్తా..**

మెదక్ నియోజక వర్గంలో తరుచుగా రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించడం వల్ల జరుగుతున్నాయని, దాని వల్ల రోడ్డు ప్రమాదాల భారీన పడ్డ వ్యక్తుల కుటుంభాలు రోడ్డుపాలు అవుతున్నాయని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మెదక్ జిల్లా ఎస్పితో చర్చించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

## ఘనంగా లయన్ పటాన్ ఉమర్ ఖాన్ జన్మదిన వేడుక



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 14, (ప్రజాజ్యోతి):** హెలెన్ కెల్లర్స్ విద్యాసంస్థల అధినేత లయన్ పటాన్ ఉమర్ ఖాన్ 66వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. హెలెన్ కెల్లర్స్ కళాశాల, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆనందోత్సాహాల నడుమ ఆయన కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి దాదాపుగా 1000 మంది బదిర విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు, సంస్థ శ్రేయోభిలాషులు కొన్ని నాగేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, పాపిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ముగం, వైస్ ప్రిన్సిపాల్ అంజయ్య, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మధు కుమార్, బదుల్ల పాఠశాల ప్రిన్సిపాల్ సాజిదా ఖానం పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ తులసి లక్ష్మి మాట్లాడు తూ.. హెలెన్ కెల్లర్స్ విద్యాసంస్థల అధినేత లైన్ పటాన్ ఉమర్ ఖాన్, ఈ పాఠశాలకి అభివృద్ధి గురించి తన ఉద్యోగాన్ని వదిలి పాఠశాల పిల్లలకు డిగ్రీ కాలేజ్ ను స్థాపించి ఎంతో మందిని ప్రయోజ కులు చేశారని తెలిపారు. ఇంకా ముమ్ముందు ఈ కళాశాలను యూనివ ర్సిటీ స్థాయికి తీసుకుని వెళ్ళాలని ఆకాంక్షించా రు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపా ధ్యాయులు తమ సంస్థ చైర్మన్ ఉమర్ ఖాన్ దంపతులను పుష్ప గుచ్చాలతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.

## నివాసితులకు అండగా ఉంటా... న్యాయం చేస్తా

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భరోసా




**మౌలాలి, ఫిబ్రవరి 14, (ప్రజాజ్యోతి) :** వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని దినకరన్ నగర్, తారక రామా నగర్ బస్తీల నివాసిత పేద ప్రజలకు అండగా ఉంటానని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భరోసానిచ్చారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి నివాసిత పేదల కు తగిన న్యాయం చేస్తా నని హామీనిచ్చారు. ఇక్కడ గత 30 ఏళ్లుగా నివాసం ఉ ంటున్న వారికి రైల్వే శాఖ ఇటీవల నోటీసు జారీ చేసింది. కాగా, వీరికి తగిన న్యాయం చేయాలని ఈ నెల 7వ తేదీన ఎమ్మెల్యే రాజ శేఖర్ రెడ్డి, రైల్వే అధికారి ఏడిఆర్ఎం గోపాల్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం మరోసారి ఆయన రైల్వే అధికారుల తో మాట్లాడి తగిన న్యా యం చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం చేస్తున్న వారికి తెలంగాణ ప్రభు త్వం ధ్రువీకరణ పత్రాలు అందజేసినప్పటికీ, రైల్వే అధికారులు నోటీసులు ఇవ్వడం సమంజసం కాద న్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశు రాం రెడ్డి, రావుల అంజ య్య, సురేష్, ఫరీద్, శ్రీకాంత్, అమీర్ తదితరు లు పాల్గొన్నారు.

## మౌలాలిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్




**మౌలాలి, ఫిబ్రవరి 14, (ప్రజాజ్యోతి) :** మౌలాలి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నేటికీ అపరి ష్కృతంగా ఉన్న సమస్య ల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ కోరారు. జిహెచ్ఎంసి అడిషనల్ కమీషనర్ (హెల్త్ ) ఎన్.రవి కిరణ్, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లతో సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడు తూ..మౌలాలి డివిజన్ లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. మెయిన్ రోడ్లు సైతం తవ్వి వదలి వేశారని, ఈ పనులు నత్త నడకన సాగుతున్నాయని తెలిపారు. ప్రజల ఇబ్బం దులను గమనించి, ఇక నైనా త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే నాలా సమస్యలను కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా దీన్ దయాళ్ నగర్ ఓపెన్ నాలాలో గత నాలుగు సంవత్సరాలు క్రితం ఓ చిన్నారి పడి పోయి నీటిలో కొట్టుకొని పోయి మృతి చెందిందని తెలిపారు. ఆ దుర్ఘటన జరిగిన సమయంలో మల్కాజిగిరి ఎంపి, ప్రస్తుత రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వచ్చి నాలా, ఇక్కడి సమస్య లను పరిశీలించి వెళ్ళా రని, సమస్యలను పరిష్క రించాలని అధికారులను ఆదేశించి వెళ్ళారన్నారు. అయినా నేటికీ ఫలితం లేదన్నారు. ఎక్కడి సమ స్యలు అక్కడే ఉన్నాయ ని కార్పొరేటర్ వాపో యారు. నేటికీ ఈ నాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆమె ఆవే దన వ్యక్తం చేశారు. ప్రతి యేటా వర్షాకాలంలో మురుగు, వరద నీరు ఇళ్ళలోకి చేరి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపా రు. డీఈ అసమర్థత వల్ల ఇక్కడ చేపడుతున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో లోపాలను ఆమె, అధికారుల దృష్టికి తీసు కు వచ్చారు. ఆ 'డీఈ' తమ డివిజన్ కు వద్దని ఖరా ఖండిగా తేల్చి చెప్పారు.

## కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతుంది

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి
- ఈనెల 16న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి



**యాచారం, ఫిబ్రవరి 14 (ప్రజాజ్యోతి):** బిజెపి కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడంతోపాటు నిత్యవసర ధరలు తగ్గించాలని కార్మిక కర్షక ఉపాధి హామీ చట్ట రక్షణ కై ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లిలో ఇంటింటా కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి, వ్యకాస జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి నర్సింహా మాట్లడుతూ గతంలో గ్యాస్ ధర రూ. 350 ఉ ండగా బిజెపి రోడ్డెక్కి గగ్గోలు పెట్టిందని ప్రస్తుతం రూ. 12 వందలు పెంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలపై పెనుబారం మోపుతుందని అన్నారు. కార్పోరేట్ శక్తులైన అంబాని, అదానిలకు ప్రజల సంపదను దోచుపెడుతూ ప్రజలను మరింత పేదవారిగా మారుస్తుందని మరోపక్క ప్రభుత్వా రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తు కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతోన్మాదా విధానాలకు వ్యతిరేకంగా 16 న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు కావలి జగన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోలే శివ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కంబాలపల్లి విప్లవ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు గుడ్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరభ్యాసం

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి ):** వసంతపంచమిని పురస్కరించుకొని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన వసంత పంచమి వేడుకల్లో పండితుల మంత్రోచ్చరణాల మధ్య తల్లింద్రులు చిన్నారులు భక్తిశ్రద్ధలతో అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానం, వాక్కు, విద్య మొదలైన శక్తులే సరస్వతీ మాత అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉ పాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఒకరి నిర్లక్ష్యం ఇంకొకరికి శాపం కాకూడదు

– ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

– జిల్లా ఎస్పీ ఎన్ కోటిరెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి14(ప్రజా జ్యోతి):** ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను పాటించినప్పుడే రోడ్డు ప్రమాదలను నివారించవచ్చని వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్. కోటిరెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా లోని పోలీస్ స్టేషన్ ల పరిధిలలో వాహనదారులకు రోడ్డు రవాణా పైన అవగాహన కలిగించారు. రోడ్డు నియమాలను ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే రోడ్డు ప్రమాదలను నివారించవచ్చని, ఒక్కరి నిర్లక్ష్యం ఒకరికి శాపం గా మారుతుందని అన్నారు.రోడ్డు ప్రయాణం లేకుండా మనషి మనుగడ లేదని, మనషి ఉదయం లేచిననుండి రాత్రి పడుకొనే వరకు ప్రతి ఒక్కరికీ రోడ్డుతో సంబంధం లేనిదే జీవనం లేదు అన్నారు. జీవితం లో ఇంత ప్రాముఖ్యత ఉన్నటువంటి రోడ్డులను మనం సక్రమంగా వాడుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించకుండా ఉపయోగించుకున్నట్లు అయితే రోడ్డు లు యమపాశాలుగా మరే అవకాశం ఉందన్నారు. కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలు,ఉద్యోగులు, డ్రైవర్లు మొదలగు వారు బయటకు వెళ్ళే సమయం లో రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించేటట్లు చూడాలని జిల్లా ఎస్పి తెలిపినారు. మైనర్ పిల్లలకు తల్లితండ్రులు ఎట్టి పరిస్థితిలో వాహనాలు ఇవ్వకూడదు. మైనర్ పిల్లలు వాహనాలతో పట్టుబడితే తల్లితండ్రుల పైన కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చినట్లు అయితే అ యజమానుపైన కూడా చట్టప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, 4 వీలర్స్ అపై వాళ్ళు తప్పని సరిగా సీట్ బెల్ట్ పెట్టుకొనే వాహనాలు నడపాలని. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదు చేసిన వారికి కఠినమైన చర్యలు తీసుకుకోవడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపే వారి దగ్గర అన్నీ రకాల పత్రాలు కల్గిఉండాలని, తల్లితండ్రులు పిల్లలకు వాహనాలు ఇప్పించే ముందు వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత విద్యా యొక్క ప్రాముఖ్యత తెలుసుకొని అవగాహన కల్పించుకొని రోడ్డు ప్రమాదాలు నివారణలో భాగం కావాలని సూచించారు.

# అభివృద్ధికి నిదర్శనం కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి



**యాలాల్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** అలాంటి అభివృద్ధి తెలంగాణలో మరోసారి రావడంతో రాష్ట్ర రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయని జిల్లా కోఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోవిందరావుపేట గ్రామంలో ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి 10 లక్షల రూపాయలను సీసీ రోడ్డు నిర్మాణం కొరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి విన్నపం మేరకు స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మంజూరు చేయడంతో ఆ పనులను ప్రారంభించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా త్వరలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకొని మారుమూల ప్రాంతాలు కూడా నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తన రూపు రేఖలలో మార్చుకొని అభివృద్ధి పథంలో ముందు నిలవనున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే తాండూరు నియోజకవర్గం అభివృద్ధి కొరకు అనునిత్యం పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోలు నాగయ్య గారు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ నాయి గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూస శేఖర్ గారు, గోనెగారి శ్రీనివాస్, చిన్న, స%శీ%కారం లాలు, కరాటే వెంకటేష్, ఉప్పలి నర్సింలు, దూస వెంకటేశం మ్యాదరి నవీన్ అంబురె అనిల్, బోయిని ఉమేష్, చిట్టపల్లి రాజు, జి. అంజి గ్రామస్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ ఎంపీడీవోగా వెంకట లక్ష్మమ్మ



**రాయపోల్ /దౌల్తాబాద్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** దౌల్తాబాద్ ఎంపీడీవో గా వెంకట లక్ష్మమ్మ బుధవారం బాధ్యతల చేపట్టారు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఎంపీడీవో విధులు నిర్వహించి దౌల్తాబాద్ బదిలీపై వచ్చారు ఇక్కడ ఎంపీడీవో గా పని చేసిన రాజేష్ కుమార్ సంగారెడ్డి జిల్లాకు వదిలి పై వెళ్లారు ఈ సందర్భంగా వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు

# నేటితో పుల్వామా దాడికి ఐదేళ్లు

ఉగ్ర ఘాతుకానికి 40 మంది సైనికులు బలైన రోజు



**యాలాల్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** జమ్మూ కశ్మీర్‌లో సైనిక బలగాలే ల క్ష్యంగా ఉగ్రమూకలు నిరంతరం దాడులకు పాల్పడుతుంటాయి. అయితే, ఏకంగా సైనిక వాహనశ్రేణినే టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు దాడికి పాల్పడి 40 మంది సైనికులను పొట్టనబెట్టుకున్న ఘటన 2019 ఫిబ్రవరి 14న చోటుచేసుకుంది. పాక్ ఉగ్రవాదులు దుశ్చర్యకు సైనికులు బలయ్యారు. ఓ మలుపు వద్ద పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో వేగంగా కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఫిదాయి.. తనను తాను పేల్చుకుని దారునికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో యావత్ దేశం శోకంలో మునిగిపోయింది. దాడిలో అమరులైన భారత సైనికుల త్యాగాలను కొట్టి చేసుకుంటూ యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణ చౌరస్తాలో చెన్నారం గ్రామ మధ్య సర్పంచ్ శివకుమార్, అగ్గనూరు యూత్ కొవ్వొత్తుతో బుధవారం రాత్రి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫిబ్రవరి 14, 2019లో పుల్వామాలో ఆత్మాహుతి దాడి చరిత్రలో నిలిచి ఉంటుందన్నారు. పాకిస్తాన్ ఉగ్రముకలు చేసిన మారణకాండతో యావత్ భారతదేశం శోకసంద్రంలో మునిగిపోయిందన్నారు.జమ్మూ నుంచి సైనికులు శ్రీనగర్‌కు వెళ్తుండగా ఘటనదశ్చర్యం వెనుక పాక్ ఉగ్రవాది సంస్థ జైషే మొహమ్మద్ ఉందని నిఘావర్గాలు తెలిపాయన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సైనిక వాహన శ్రేణిపై పాకిస్థాన్‌కు చెందిన జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు ఆత్మాహుతికి దాడికి పాల్పడ్డాయన్నారు. ఈ దాడిలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)కి చెందిన 40 సైనికులు బలయ్యారన్నారు. జమ్మూ- శ్రీనగర్ జాతీయ రహదారిపై లేత్‌పుర (అవంతిపురా సమీపం)లో 2019 ఫిబ్రవరి 14న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ఘాతుకం చోటుచేసుకుందన్నారు. జమ్మూ నుంచి సైనికులు శ్రీనగర్‌కు వెళ్తుండగా ఈ ఆత్మాహుతి దాడి జరిగిందన్నారు. ఆత్మాహుతి దాడికి కశ్మీరీ ఉగ్రవాది ఆదిల్ అహ్మద్ దార్‌ను వినియోగించారన్నారు. ఆత్మాహుతి దాడిలో పాల్గొన్న ఆ ఉగ్రవాది కూడా హతమయ్యాడన్నారు. పక్కా వ్యూహంతోనే ఉగ్రవాదులు దాడికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. సీఆర్పీఎఫ్ వాహనాలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాది అదిల్ అహ్మద్ దార్, తన వాహనాన్ని జాతీయ రహదారిపై కల్వర్టు పక్క నుంచి కాన్వాయ్‌కి ఎడమవైపు నుంచి ప్రవేశించాడన్నారు. జాతీయ రహదారికి అనుబంధ మార్గం నుంచి అవంతీపొర సమీపంలో లాటూ గుండా అతడు వచ్చినట్టు పోలీసులు గుర్తించారన్నారు. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాది, మొదటి బస్సును దాటుకుంటూ ఎడమ వైపు నుంచి ఐదో వాహనాన్ని ఢీకొట్టాడు. ఉగ్రదాడి జరగడానికి ముందు స్థానిక యువకులు దాదాపు 10 నిమిషాల పాటు సీఆర్పీఎఫ్ వాహన శ్రేణిపై రాళ్లు రువ్వారన్నారు. ఈ సమయంలోనే పేలుడు పదార్థాలతో ఉన్న కారును నడుపుకుంటూ వచ్చిన ఉగ్రవాది, సీఆర్పీఎఫ్ వాహన శ్రేణిలోని ఐదో బస్సును ఢీకొట్టాడన్నారు. దాడికి అనువైన ప్రదేశాన్ని కూడా వ్యూహాత్మకంగానే ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారన్నారు. జమ్మూ-శ్రీనగర్ రహదారిలో లెత్-పోరా వద్ద రోడ్డు చాలా వాలుగా ఉంటుందన్నారు. ఈ ప్రదేశంలో వాహనాలు నెమ్మదిగా వెళ్తాయన్నారు. సీఆర్పీఎఫ్ కాన్వాయ్ సైతం నిదానంగా వెళ్తుందని ముందే అంచనా వేసిన ఉగ్రవాది 78 వాహనాల కాన్వాయ్‌లోని 5వ బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ ప్రదేశంలో ఎటువంటి సీసీ కెమేరాలు లేకపోవడంతో వారి పని మరింత సులువైందన్నారు. సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో 10 మందికి పైగా మిలిటెంట్లు హతమయ్యారన్నారు. పుల్వామా దాడి తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయన్నారు. ఈ దాడికి తామే బాధ్యులమంటూ పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించడంతో భారత్ మరింత ప్రతీకారంతో రగిలిపోయిందన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలని భావించిన భారత్.. అందుకు మరోసారి సర్జికల్ స్ట్రయిక్స్‌ను ఎంచుకుందన్నారు. 2019 ఫిబ్రవరి 26 తెల్లవారుజామున సరిహద్దులు దాటి పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లిన భారత వాయుసేన విమానాలు.. బాలాకోట్‌లోని జైషే మొహమ్మద్ ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాయన్నారు. ఈ ఎయిర్ స్ట్రయిక్స్‌లో దాదాపు 300 మంది ఉగ్రవాదులు హతమయ్యారన్నారు. 40 ఏళ్ల తర్వాత పాక్ భూభాగంలోకి భారత్ యుద్ధ విమానాలు చొచ్చుకెళ్లడం ఇదే తొలిసారన్నారు. బాలాకోట్ ఎయిర్ స్ట్రయిక్స్ తర్వాత దాయాదుల మధ్య యుద్ధ మేఘాలు మరింత కమ్ముకున్నాయన్నారు. ఈ దాడికి ప్రతీకారంగా సరిహద్దుల్లోని సైనిక స్థావరాలపై ఎఫ్-16 యుద్ధ విమానాలతో పాకిస్థాన్ దాడికి ప్రయత్నించిందన్నారు. అయితే, వీటిని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోహెడలలో కలకలం.. భారీగా పేలుడు పదార్థాలు పట్టివేత

– పేలుడు పదార్థాల అక్రమ వినియోగం, నిల్వ, రవాణాపై నిఘా పెంచాం

– హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్ – నిషేదిత పేలుడు పదార్థాల పట్టివేత

**కోహెడ, ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** కోహెడ శివారులో నూతనంగా నిర్మిస్తున్న వెంచర్ వద్ద అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ వున్నట్లు అందిన సమాచారం మేరకు హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్, కోహెడ ఎస్.ఐ తిరుపతి ఘటన స్థలంలో సోదాలు నిర్వహించారు. వెంచర్ లో ఉన్న ట్రాక్టర్ లో దాదాపు 97 జిలెటిన్ స్టిక్స్, 100 డిటోనేటర్లు స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సి.ఐ తెలిపారు. ఈ నిషేదిత పేలుడు పదార్థాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓర్సు సమ్మయ్య కి చెందినవని, తను పరారీలో ఉన్నట్లు.. ఈ విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సి.ఐ తెలిపారు.

**పేలుడు పదార్థాల అక్రమ వినియోగం, నిల్వ, రవాణాపై నిఘా పెంచాం..**

సిద్ధిపేట పోలీస్ కమిషనర్" ఆదేశాలనుసారం సర్కిల్ వ్యాప్తంగా.. అక్రమ కార్యక్రమాలపై, నిఘా పెంచామని, హుస్నాబాద్ సి.ఐ కిరణ్ తెలిపారు. ఎవరైనా పేలుడు పదార్థాలు.. అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేసిన దాడులు నిర్వహించి, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## గజ్వేల్ డివిజన్ నూతన ఏసిపిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బాలాజీ



**రాయపోల్ ఫిబ్రవరి 14 ప్రజా జ్యోతి** గజ్వేల్ డివిజన్ నూతన ఏసిపి గా పదవీ బాధ్యతలు చేపట్టిన బాలాజీ, బుధవారం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మేడం ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అభినందించి గజ్వేల్ డివిజన్ పరిధిలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మరియు అసాంఘిక కార్యక్రమాల జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని సూచించారు. రాబోవు ఎంపీ ఎలక్షన్ సందర్భంగాముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా విసబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పుల్వామా ఉగ్ర దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు యువకులు ఘనంగా నివాళులు



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి):** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఆర్మీ జవాన్ల మరియు యువకుల ఆధ్వర్యంలో స్థానిక ఆజాద్ నగర్ చౌరస్తా నుండి స్వామి వివేకానంద చౌరస్తా వరకు కోతులతో ర్యాలీ నిర్వహించి 40 మంది జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. ఐదేళ్ల కిందట 2019 ఫిబ్రవరి 14నపుల్వామాలో జరిగినఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. సరిగ్గా ఈ దుర్ఘటన జరిగి ఐదు సంవత్సరాలు కావస్తోంది ఓ అమరులారా మీ త్యాగాలను మరువలేము అంటూ యువకులు 40 మంది అమర జవాన్ల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ శ్రీకాంత్ పర్మాన్ దొడ్డి,ఆర్మీ గణేష్ మక్తల్, ఆర్మీ కృష్ణ మక్తల్, ఆర్మీ విద్యార్థి దేశ యువకులు గణేష్, సుభాష్, రామకృష్ణ, రఘు, ప్రవీణ్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో అన్ని పార్లమెంట్ స్థానాల్లో పోటీకి సిద్ధం

– వీరంకే వీర్ ఇండియన్ పార్టీ




**ఖైరతాబాద్: ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెం ట్ స్థానాలతో పాటు దేశంలోని అన్ని పార్లమెంటు స్థానాలలో పోటీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని విరొంకె వీర్ ఇండియన్ పార్టీ తెలిపింది. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ తెలంగాణ అధ్యక్షులు రాజేశ్వర్ మాట్లాడుతూ.. భారతదేశం వీరుల దేశమని అన్నారు. భారతదేశంలో ప్రతి వ్యక్తి వీరుడు, ధైర్యవంతుడైనని అన్నారు. అలాంటి వారి కోసం పుట్టిన పార్టీ వీరొంకే వీర్ ఇండియన్ పార్టీ అని తెలిపారు. సైనికులు దేశభక్తి తోపాటు నీతి నిజాయితీపరులని అన్నారు. అలాంటివారికి అధికారం ఇస్తే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కుల, మత, స్వార్ధ రాజకీయాలను తరిమికొడుతూ నేటి బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే మాజీ సైనికులమైన తమకు ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ అభ్యర్థి సైదులు, చేవెళ్ల అభ్యర్థి పెంటారెడ్డి, మల్కాజ్గిరి అభ్యర్థి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా కొత్తూరి మహేష్

**కొడిమ్యాల,ఫిబ్రవరి14,(ప్రజాజ్యోతి):** మండల కేంద్రానికి చెందిన పర్లపల్లి మాణిక్యం గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా,మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తూరి మహేష్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణమే 5000 రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది. నరేష్,గణేష్,కిట్టు,ప్రశాంత్,అనిల్,భాను,శంకర్,శ్రీను,శంకర్,నాని తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలను చైతన్యవంతం చేసే మహా ఆయుధం సాహిత్యం




**ఖైరతాబాద్ ఫిబ్రవరి 14 (ప్రజా జ్యోతి)** ప్రజలను చైతన్యవంతం చేసే మహా ఆయుధం సాహిత్యం అని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు.ప్రవీణ్ రచించిన శ్రీలేఖలు కవిత సంపుటి పుస్తకాన్ని హీరో సుమంత్ తో కలిసి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మనుషులలో నిద్రాణమైన శక్తులను బయటకు తీసుకువచ్చి సమాజానికి దిక్సూచిగా రచయితలు పనిచేస్తారన్నారు. సమకాలిన ఆర్థిక సామాజిక అంశాల పై ప్రభావశీలమైన రచనలతో రచయితలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రచయితలు కొత్త కొత్త ఆలోచనలతో సామాజిక దృక్పథం కోణంలో రచనలు చేయాలని సూచించారు. నేటి సమాజంలో కొత్త పరిణామాల వల్ల కవిత్వం తన అస్తిత్వాన్ని కోల్పోకుండా నూతన త్వాన్ని సంతరించుకోవాలన్నారు. భ్రష్టు పట్టిన రాజకీయాల ప్రక్షాళన కోసం భవిష్యత్తులో మంచి రచనలు చేయాలని రచయిత ప్రవీణ్ ను సూచించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత ప్రవీణ్ ను మాజీ డిసిపి బద్రీనాథ్ తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి గుజ్జ కృష్ణ, నీల వెంకటేశం,సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేణుగోపాల్ నాయుడు,చిన్న శ్రీశైలం యాదవ్,జర్నలిస్ట్ సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఖాళీ చేతులతో స్వీయ రక్షణ చేసుకోవడం

– సెయింట్ మేరీస్ హెచ్ఎం ఫాదర్ జోసెఫ్ అశోక్



**సుల్తానాబాద్ ఫిబ్రవరి 14( ప్రజా జ్యోతి)** కరాటే అంటే ఎటువంటి ఆయుధం లేకుండా మనల్ని మనం ఖాళీ చేతులతో రక్షించుకోవడమని సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం కరెస్పాండెంట్ హెచ్ఎం ఫాదర్ తుమ్మ జోసెఫ్ అశోక్ పేర్కొన్నారు. ఈ నెల 11న కరీంనగర్ లో జరిగిన ఒకినోవా ఇన్స్టిట్యూషన్ వారి ఆద్వర్యంలో తెలంగా ఇంటర్ స్టేట్ కరాటే 2024 చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచి, పలు పథకాలు,ప్రశంసా పత్రాలు సాధించి తిరిగి వచ్చిన పలువురు విద్యార్థులకు ఘనస్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఒక్క విద్యలోనే కాకుండా ఆటలు,పాటల తోపాటు ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకొనేలా ప్రావీణ్యం పొంది ఉండాలన్న సదుద్దేశంతో పాఠశాల ఆవరణలో కరాటే కోర్స్ ప్రారంభించామని అన్నారు. కరాటే కొరకు రోజువారీ పాఠశాల సమయంలో కొంత సమయం కేటాయించి నిష్ణాతులైన కరాటే కోచ్ లతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. అలా శిక్షణ తీసుకున్న వారిలో కొంతమందిని ఇంటర్ స్టేట్ లెవెల్ లో జరిగిన పోటీలకు పంపగా అందులో 7ఎ వ తరగతికి చెందిన శశి కావ్య – బ్రాంజ్, 8వ తరగతి ప్రవస్తి – బ్లాక్, 3–బి వ తరగతి వర్షిణి – బ్రాంజ్, 3 ఎ వ తరగతి మెర్సీ – బ్రాంజ్, 7 ఎ వ తరగతి మనీషా – బ్రాంజ్, 4 ఎ వ తరగతి కే అక్షర – బ్లాక్, 5 ఎ వ తరగతి వి అకీరానందన్ – సిల్వర్ మెడళ్లు సాధించి ముందువరుసలో నిలిచారనీ వెల్లడించారు. వీరిని ఫాదర్ అశోక్ తోపాటు అధ్యాపక బృందం, పాఠశాల సిబ్బంది ప్రశంసించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరందరూ మున్ముందు జరుగబోయే స్టేట్ లెవెల్ క్రీడలకు అర్హత సాధించారని, వీరికి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పి ప్రోత్సహించారు.

## గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

– ఆన్లైన్ ప్రక్రియ వేగవంతం – ఏఈ రంగు శంకర్

**సుల్తానాబాద్ ఫిబ్రవరి 14( ప్రజా జ్యోతి)** అర్హులైన ప్రతి కుటుంబం గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఏఈ రంగు శంకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో ఒకటైన గృహజ్యోతి 200 యూనిట్ల కరెంటు ఫ్రీ కార్యక్రమ ఆన్లైన్ నమోదు కార్యక్రమం వేగవంతంగా నిర్వహించబడుతుందని ఏఈ రంగు శంకర్ తెలిపారు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి ని పరిశీలించి ఆన్లైన్ చేస్తున్నట్లు ఈనెల 15న చివరి తేదీ ఉన్నందున లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఈ శంకర్ తెలిపారు కరెంట్ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్లైన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు తెల్ల రేషన్ కార్డు తో పాటు ఆధార్ కరెంటు మీటర్ చెల్లింపు బిల్లు తీసుకొని వచ్చి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని కోరారు గత కొన్ని రోజులుగా ఆన్లైన్ ప్రక్రియ స్థానిక మున్సిపల్ కార్యాలయ పై అంతస్తులో కొనసాగుతుందని ప్రజలందరూ గమనించాలని ఏఈ శంకర్ కోరారు ఈ కార్యక్రమంలో కరెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

